PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 158 | విజయవాడ, శుక్రవారం 12 జనవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 12 January 2024 | Rs

ఆలయం సరే... విధ్వంసం మాటేమిటి?

- గూడు కోల్పోయి రోడ్డునపడ్డ అయోధ్య వాసులు
- మూతపడిన వ్యాపారాలు... దినదిన గండంగా బతుకులు

లోపలి పేజీలో..



'శివ'మెత్తిన దూబే

- తొలి టి20లో ఆఫ్ఘన్‌పై టీమిండియా ఘన విజయం

లోపలి పేజీలో

బిజెపి వ్యతిరేక శక్తులను కూడగడతాం

- సిపిఎం రాష్ట్ర కమిటీ నిర్ణయం
- రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన ఊడిగం
- శ్రామికుల సమస్యలను సర్కారు పరిష్కరించాలి : వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

బిజెపి వ్యతిరేక పార్టీలను, శక్తులను కూడగట్టి రానున్న ఎన్నికల్లో ముందుకు సాగాలని సిపిఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. రెండు రోజులపాటు ఏలూరులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన ఊడిగం చేస్తున్నాయని అన్నారు. ఆ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ప్రజా సమస్యలు, రాజకీయ పరిస్థితులపై సమీక్షించి నిర్ణయాలు తీసుకున్నామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం జిందాల్‌కు అప్పగించిందని, కార్మికులు పెద్దఎత్తున పోరాడుతూ కార్పొరేట్ శక్తులను అడ్డుకుంటూ వచ్చారని తెలిపారు. బిజెపికి జగన్ మద్దతు పలుకుతూ అదానీకి పోర్టులు అప్పగిస్తున్నారని విమర్శించారు. స్వార్థ రాజకీయాలకు పాల్పడుతోన్న బిజెపికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు మద్దతు పలకడం దారుణమన్నారు. అంగన్‌వాడీలు రోడ్డునపడి 31 రోజులు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. వెంటనే చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించి అంగన్‌వాడీలంతా సంక్రాంతి పండుగ జరుపుకునేలా చూడాలన్నారు. 32 లక్షల మంది తల్లీబిడ్డలకు అంగన్‌వాడీలు రక్షణగా నిలిచారని, వారి సమ్మెకు ప్రజల నుంచి మద్దతు ఉందని తెలిపారు. లక్ష మంది అంగన్‌వాడీలు ఉన్నారని, ఒక్క ఉద్యోగిని తొలగించినా తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామన్నారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పిందని, పదవీ కాలం పూర్తయినా ఉద్యోగాల భర్తీ లేదని విమర్శించారు. మెగా డిఎస్‌సి కోసం ఐదు లక్షల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని, ఆందోళన చేస్తే పోలీసులతో దౌర్జన్యం చేయడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రంలో 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి నిర్వహించడం లేదన్నారు.

వెంటనే టీచర్ పోస్టులను భర్తీచేయాలని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాలకు వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించడంతోపాటు 104, 108, ఆశాలు, కమ్యూనిటీ హెల్త్‌వర్కర్స్, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమకు ఎటువంటి హక్కులూ లేకుండా పోయాయని ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఎమ్మెల్యేలు కుమిలిపోతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం రోజురోజుకీ ప్రజాదరణ కోల్పోతుందని, సంక్షేమ పథకాలతో ఓట్లు వస్తాయనుకుంటే చెల్లదని, అది వైసిపి రాజకీయ ఉనికికే ప్రమాదమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ పాల్గొన్నారు.



ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

- 31 నుండి పార్లమెంటు సమావేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరిసారిగా పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 31న బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. మధ్యంతర బడ్జెట్‌లో మహిళా రైతులకు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇచ్చే నగదు సాయాన్ని రెట్టింపు చేస్తారని భావిస్తున్నారు. ఇక ఏప్రిల్, మేలో లోక్‌సభ ఎన్నికలు రానుండటంతో బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం ఏమైనా కీలక ప్రకటనలు చేస్తుందా? అనే ఉత్కంఠ నెలకొంది. రెండు మూడు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నందున పూర్తి బడ్జెట్‌గా కాకుండా మధ్యంతర బడ్జెట్‌గా ఉంటుంది. ప్రభుత్వం ఎన్నికల సంవత్సరంలో లేదా పూర్తి బడ్జెట్‌కు తగినంత సమయం లేనప్పుడు మధ్యంతర బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పిస్తుంది. ఎన్నికల తరువాత వచ్చే ప్రభుత్వం పూర్తి వార్షిక బడ్జెట్‌ను రూపొందించే బాధ్యతను తీసుకుంటుంది. సమగ్ర ఆర్థిక సర్వేకు బదులుగా ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌కు ముందు 2024-25 సంవత్సరానికి సంబంధించి దేశ ఆర్థిక స్థితిపై సంక్షిప్త పత్రాన్ని సమర్పించాలని భావిస్తున్నారు.

నిరుద్యోగ భారతం

- 20-34 సంవత్సరాల యువతలో అత్యధికం
- గ్రామీణ ప్రాంతాల్లో మరింత ఘోరం
- సిఎంఐఇ తాజా నివేదిక

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో నిరుద్యోగ రక్కసి కోరలు చాచింది. ప్రతి యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామంటూ ఊరించి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఆచరణలో యువతరాన్ని నిట్టనిలువునా ముంచేసింది. మోడీ ప్రభుత్వ విధానాల కారణంగా పని చేసే చేవ ఉన్నా.. ఉపాధి దక్కక యువతరం ఈసురోమంటోంది. భారత ఆర్థిక వ్యవస్థ సమీక్షా కేంద్రం (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ - సిఎంఐఇ) విడుదల చేసిన తాజా నివేదికలో ప్రధానంగా 20-34 సంవత్సరాల మధ్య వయసున్న యువతలో ఏడాదికేడాదికి నిరుద్యోగం పెరుగుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. యువతకు నగరాలు, పట్టణాలతోపాటు గామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు కూడా దొరకడం లేదు. ఈ సమయంలోనే కేంద్రప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నీరుగారుస్తుండటం గమనార్హం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కుదించుకుపోవడంతో యువత స్వయం ఉపాధి వైపు మొగ్గుచూపుతోంది. దీనిని కూడా మోడీ సర్కారు తన ఘనతగా చెప్పుకుంటోంది. పట్టణ ప్రాంతాల్లోని మధ్య వయస్కుల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనపడుతోంది. ఫలితంగా ఇక్కడ స్వల్పంగా నిరుద్యోగం తగ్గినట్టు కనిపిస్తోంది.

నివేదికలో ఇలా...

సిఎంఐఇ నివేదిక ప్రకారం గత సంవత్సరం 20-24 సంవత్సరాల యువతలో (2023) జులై-సెప్టెంబర్ మధ్య 43.65శాతం నిరుద్యోగం ఉండగా, అక్టోబర్ -డిసెంబర్ నాటికి 44.49శాతానికి పెరిగింది. 25-29 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో నిరుద్యోగం ఇదే కాలంలో 13.35% నుండి 14.33%కి పెరిగింది. 25-29 సంవత్సరాల మధ్య వయసున్న యువతలో నమోదైన 14.33% నిరుద్యోగం 14 త్రైమాసికాలలో అత్యధికం కావడం గమనార్హం. 30-34 సంవత్సరాల మధ్య వయస్కులలో నిరుద్యోగ రేటు కూడా 2.06% నుండి 2.49%కి పెరిగి పది త్రైమాసికాలలో అత్యధిక స్థాయికి చేరుకుంది. పట్టణ నిరుద్యోగంతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగమే అధికంగా ఉన్నదని సిఎంఐఇ తెలిపింది. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి 20-24 సంవత్సరాల మధ్య వయసున్న యువతలో నిరుద్యోగం గరిష్ట స్థాయికి (43.79%) చేరింది. ఈ రేటు 25-29 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో 13.06%, 30-34 సంవత్సరాల మధ్య వయస్కులలో 2.24%గా నమోదైంది.

గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగానికి సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ జాతీయ ఉపాధి హామీ చట్టం నుండి తీసుకున్న గణాంకాలు, సిఎంఐఇ గణాంకాల మధ్య సామీప్యత కన్పించింది. గ్రామీణ ప్రాంతాలలో ఈ చట్టం ద్వారానే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో గ్రామీణ కుటుంబాలు 1.3% ఎక్కువ పనిని డిమాండ్ చేశాయి. రెండో త్రైమాసికంలో నమోదైన 15.1% పెరుగుదలతో పోలిస్తే ఇది చాలా తక్కువ.



గూగుల్‌లో మళ్లీ ఉద్వాసనలు..

- అమెజాన్ సిబ్బందిలోనూ ఆందోళన


లోపలి పేజీలో..

చిరువ్యాపారులకు ఊతం

- 8వ విడత జగనన్న తోడులో సిఎం
- బటన్ నొక్కి రూ.431 కోట్లు విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చిరువ్యాపారులకు జగనన్నతోడు ఊతమిస్తుందని, దీనికోసమే రూ.431 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్నామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎనిమిదో విడత జగనన్నతోడు కార్యక్రమాన్ని ఆయన బటన్‌నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 86,084 మంది చిరు వ్యాపారులకు రూ.86 కోట్లు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని, వీరితోపాటు గతంలో స్కీము ద్వారా రుణాలు పొందిన 3.09 లక్షల మంది చిరు వ్యాపారులకు రూ.332 కోట్ల రుణాలను రెన్యువల్ చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రూ.418 కోట్లను 3.95 లక్షల మందికి ఇస్తున్నామని పేర్కొన్నారు. కట్టిన వడ్డీలు రూ.88.33 కోట్లు తిరిగి వారికే ఇస్తున్నామని పేర్కొన్నారు. వీరిలో 73,072 మంది లబ్ధిదారులు ఇప్పటికే నాలుగుసార్లు డబ్బులు కట్టి తీసుకున్నారని, అదే విధంగా 5.10 లక్షల మంది మూడుసార్లు డబ్బులు కట్టారని తెలిపారు. దీనిద్వారా చిన్న వ్యాపారులు, హస్త కళాకారులు, ఫుట్‌పాత్ అమ్మకాలు చేసేవారు, వీధుల్లో తోపుడు బండ్ల మీద కూరగాయలు అమ్ముకునేవారు, రోడ్డుపక్కన టిఫిన్ సెంటర్ల నిర్వాహకులందరికీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, గ్రామ వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, సెర్ప్ సిఇఓ ఇంతియాజ్, అధికారులు మహ్మద్ దివాన్, మెప్మా ఎమ్‌డి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎనిమిదో విడత జగనన్నతోడు నమూనా చెక్కును విడుదల చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

గణతంత్ర వేడుకల్లో 16 శకటాలే !

- వివక్ష చూపారని కేంద్రంపై కర్ణాటక, పంజాబ్ ఆగ్రహం

7

సమ్మె విచ్ఛిన్నానికి నోటీసులు

- అంగన్‌వాడీలు ఇళ్ల వద్ద లేకుంటే కుటుంబ సభ్యులకు అందజేత
- సమస్యలు పరిష్కరించకపోతే రాజకీయ పోరు : వి శ్రీనివాసరావు

లోపలి పేజీలో..

బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం

- నిరసన కార్యక్రమాలకు యుటిఎఫ్ పిలుపు

ప్రాజెక్టులు ఖాళీ

- వేసవిలో కష్టాలు తప్పవా?



విజయవాడ ధర్నా చౌక్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ నాయకులు, కార్యకర్తలు

సమస్యలు పరిష్కరించాలని

కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం

- అంగన్‌వాడీ సంఘాల ప్రకటన
- భోగి మంటల్లో ఎస్మా నోటీసులు
- సంక్రాంతి తరువాత ఉద్యమం తీవ్రం
- మోకాళ్లపై నిలబడి నిరసన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం కోటి సంతకాలు సేకరించాలని అంగన్‌వాడీలు నిర్ణయించారు. 'జగనన్నకు చెబుదాం..' పేరిట రాష్ట్రవ్యాప్తంగా ఈ సంతకాల సేకరణ కార్యక్రమం జరగనుంది. విజయవాడ ధర్నా చౌక్‌లోని దీక్షా శిబిరంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) రాష్ట్ర కార్యదర్శి

మిగతా 2లో

కేశినేని నానికి విజయవాడ

- వైసిపి మూడో విడత జాబితా విడుదల


- ఆరు ఎంపి, 15 మంది ఎమ్మెల్యే అభ్యర్థుల ఖరారు
- మల్లాది విష్ణుకు మొండిచేయి
- పెనమలూరుకు జోగి రమేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుదీర్ఘ చర్చల అనంతరం వైసిపి మూడో జాబితాను గురువారం ప్రకటించింది. దీనిలో ఆరుగురు ఎంపి అభ్యర్థులతోపాటు 15 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా ఉన్నారు. బుధవారం వైసిపిలో చేరిన విజయవాడ ఎంపి కేశినేని నానికి విజయవాడ లోక్‌సభ స్థానంతోపాటు, ఆయన అనుచరుడు స్వామిదాస్‌కు తిరువూరు టికెట్లు ఖరారు చేశారు. ఇప్పటి వరకూ మీడియాలో పెద్దఎత్తున చర్చ జరిగిన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు ఈ లిస్టులోనూ మొండిచేయి చూపించారు. మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీకి విశాఖపట్నం పార్లమెంటు స్థానం ఇచ్చారు. తిరుపతి ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన గురుమూర్తికి సత్యవేడు అసెంబ్లీ సీటు కేటాయించారు. శ్రీకాకుళం జడ్పీ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ఉప్పాడ నారాయణమ్మను ప్రకటించారు. ఇప్పటి వరకూ 59 అసెంబ్లీ నియోజవకర్గాలకు ఇన్‌ఛార్జులను ప్రకటించారు.

పార్లమెంటు నియోజకవర్గాల అభ్యర్థులు	
శ్రీకాకుళం(ఎంపి)	పేరాడ తిలక్
విశాఖపట్నం(ఎంపి)	బొత్స ఝాన్సీరాణి
ఏలూరు(ఎంపి)	కారుమూరి సునీల్‌కుమార్
విజయవాడ(ఎంపి)	కేశినేని శ్రీనివాస్ (నాని)
కర్నూలు(ఎంపి)	గుమ్మనూరి జయరాం
తిరుపతి(ఎంపి)	కోనేటి ఆదిమూలం
అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు	
ఇచ్ఛాపురం	పిరియా విజయ
టెక్కలి	దువ్వాడ శ్రీనివాస్
చింతలపూడి(ఎస్‌సి)	కంభం విజయరాజు
రాయదుర్గం	మెట్టు గోవిందరెడ్డి
దర్శి	బూచేపల్లి శివప్రసాదరెడ్డి
పూతలపట్టు(ఎస్‌సి)	ఎన్.సునీల్‌కుమార్
చిత్తూరు	విజయానందరెడ్డి
మదనపల్లి	నిస్సార్ అహ్మద్
రాజంపేట	ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
ఆలూరు	బి.విరూపాక్షి
కొడుమూరు(ఎస్‌సి)	డాక్టర్ సతీష్
గూడూరు(ఎస్‌సి)	మేరిగ మురళీ
సత్యవేడు(ఎస్‌సి)	మద్దిల గురుమూర్తి
పెనమలూరు	జోగి రమేష్
పెడన	ఉప్పాల రాంప్రసాదు


శివాంజి


నాగసాయి

నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)

నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మరణించిన సంఘటన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. పాత గోళ్లవిడిపి గ్రామానికి చెందిన నార్ణపాటి శివాంజి (8), నార్ణపాటి నాగసాయి (9)తో పాటు మరో బాలుడు, ఇద్దరు బాలికలు సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఆడుకుంటూ సమీప పొలంలోని నీటి కుంట వద్దకు వెళ్లారు. నీళ్ల తాగేందుకు నార్ణపాటి శివాంజి, నార్ణపాటి నాగసాయితో పాటు మరో బాలుడు దిగారు. ముగ్గురూ కాలు జారి కుంటలో పడిపోయారు. ఒడ్డున ఉన్న ఇద్దరు బాలికలు ఒక బాలుడిని అతి కష్టం మీద రక్షించారు. మిగతా ఇద్దరూ కుంటలో మునిగిపోయారు. బాలికలు కేకలు వేయడంతో సమీప రైతులు వచ్చి బయటకు తీశారు. ఊపిరాడక అప్పటికే వారిద్దరూ మృతి చెందారు. వారిద్దరు చిన్నారులూ అన్నదమ్ముల పిల్లలు.

విభజన హామీల సాధన కోసం

తీవ్రంగా మలిదశ ఉద్యమం

- ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా విభజన హామీల సాధన భావితరాలకు అవసరమని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి నాయకులు తెలిపారు. దీనికోసం మలిదశ ఉద్యమాన్ని తీవ్రం చేయనున్నామని ప్రకటించారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సాధన సమితి విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా రాయితీలు ఇచ్చే వరకూ పోరాడుతూనే ఉంటామని తెలిపారు. పోరాటాల ద్వారానే కొన్ని హామీలు అయినా వచ్చాయని, గత నెలలో దీనిపై ఢిల్లీలో ఆందోళన చేశామని, ఇక నుండి రాష్ట్ర వ్యాప్తంగా చేస్తామని ప్రకటించారు. జిల్లాస్థాయి నుంచి మండల స్థాయి వరకూ నిరాహార దీక్షలు ఉంటాయని, అన్ని పార్టీల నాయకులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. యువత భవిష్యత్‌ను కోరి అందరూ ఉద్యమంలోకి రావాలని కోరారు. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి లక్ష్మీనారాయణ అన్నారు. ప్రత్యేక హోదాను అన్ని పార్టీలూ వారి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టేంత వరకూ పోరాటం సాగుతుందని వివరించారు. రైతు ఉద్యమం తరహాలోనే ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా కోసం పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తమిళనాడులో జల్లికట్టు కోసం జరిగిన ఆందోళన తరహాలో పోరాడితేనే అన్ని రాజకీయ పార్టీలూ రాష్ట్రం వైపు చూస్తాయని వివరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని నిర్మాణం వంటి అనేక అంశాలపై నమ్మకం ద్రోహం చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలమయ్యాయని అన్నారు. వైసిపి రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రం వద్ద మోకరిల్లిందని, కేంద్రాన్ని డిమాండ్ చేసే సందర్భాలు అనేకసార్లు వచ్చినా అవకాశాన్ని ఉపయోగించుకోలేదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో హోదా, విభజన హామీలు ఒక అజెండా కావాలన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన కేంద్రంతో కుమ్మక్కవ్వడానికి రాష్ట్ర పార్టీలు పోటీలు పడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ రాష్ట్రానికి హోదా హామీ ఇచ్చిందని, తిరుపతిలో వెంకన్న సాక్షిగా మోడీ హామీ ఇచ్చి పదేళ్లు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రమణ్యం, పోతిన వెంకట రామారావు, ఎమ్‌సిపిఐ(యు) నాయకులు ఖాదర్ బాషా, ఎఐవైఎఫ్ నాయకులు పరుచూరి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి, వివిధ పార్టీల నాయకులు


స్వాగతం పలుకుతున్న రైతు సంఘాల నాయకులు

రాకేష్ తికాయత్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
భారతీయ కిసాన్ యూనియన్ అధ్యక్షులు రాకేష్ తికాయత్‌కు గన్నవరం విమానాశ్రయంలో రైతు సంఘాల నాయకులు ఘనస్వాగతం పలికారు. విజయవాడ సిద్ధార్థ అకాడమీలో శుక్రవారం జరిగే సదస్సులో పాల్గొనేందుకు గురువారం రాత్రి ఆయన గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. స్వాగతం పలికిన వారిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, నాయకులు ఎవిజి కృష్ణ, కుర్రా నరేంద్ర, జి ఉమా వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎస్‌సి వర్గీకరణకు సిఎం సహకరించాలి

- మంద కృష్ణ

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి
రాబోయే ఎన్నికల్లో మాదిగలకు రెండు లోక్‌సభ, 15 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ డిమాండ్ చేశారు. గుంటూరులో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు సిఎం జగన్ సహకరించాలని కోరారు. ఈ నెల 17న సుప్రీం కోర్టులో ఎస్‌సి వర్గీకరణపై విచారణ జరుగుతుందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీనియర్ న్యాయవాదిని నియమించాలని అన్నారు. వర్గీకరణకు కట్టుబడి ఉన్నామనిగతంలో జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని, ఇప్పుడు ఈ అంశాన్ని ఆయన పట్టించుకోకపోవడం సరికాదన్నారు.
వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, కేంద్రం చేసే కసరత్తుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని, పార్టీ పరంగా లేఖ రాయాలని కోరారు. 20 ఏళ్ల తరువాత మరలా సుప్రీం కోర్టులో షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశంపై విచారణ జరగబోతుందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని తెలిపారు.

ప్రాజెక్టులు ఖాళీ



వేసవిలో కష్టాలు తప్పవా?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులన్నీ ఖాళీ అయ్యాయి. గత ఏడాది వర్షాభావ పరిస్థితులకు తోడు వచ్చిన నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోకపోవడంతో జనవరిలోనే ప్రాజెక్టుల్లోని నీటిమట్టాలన్నీ ప్రమాదకర పరిస్థితుల్లోకి పడిపోయాయి. జనవరిలోనే ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు అడుగంటి పోతే జూలైదాకా తాగునీటి అవసరాల సమస్య పరిష్కారం ఎలా అన్నది ప్రశ్నార్ధకంగా మారింది. శ్రీశైలం ప్రాజెక్టులో నీరు ఇప్పటికే డెడ్‌స్టోరేజ్ స్థాయికి చేరువయ్యాయి. ప్రస్తుతం శ్రీశైలంలో కేవలం 47.6 టిఎంసిలు మాత్రమే వున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 84.28 టిఎంసిలు వుండేవి. తుంగభద్ర డ్యామ్‌లో గత ఏడాది 67.75 టిఎంసిలు వుండగా, ప్రస్తుతం కేవలం 10.21 టిఎంసిలు వున్నాయి. నాగార్జునసాగర్‌లో గత ఏడాది 273.27 టిఎంసిలు వుండగా, ఈ ఏడాది కేవలం 154 టిఎంసిలు ఉన్నాయి. పులిచింతల ప్రాజెక్టులో గత ఏడాది 44.2 టిఎంసిలు వుంటే ఈ ఏడాది కేవలం 12.45 టిఎంసిలు మాత్రమే వున్నాయి. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో గత ఏడాది 12.94 టిఎంసిలు వుండగా, ఈ ఏడాది కేవలం 2.62 టిఎంసిలు మాత్రమే వున్నాయి. సోమశిల ప్రాజెక్టులో గత ఏడాది 71.90 టిఎంసిలు వుంటే ఇపుడు 31.2 టిఎంసిలు మాత్రమే వున్నాయి. కండలేరు రిజర్వాయర్‌లో గత 52.5 టిఎంసిలు వుంటే ప్రస్తుతం 12.8 టిఎంసిలు మాత్రమే వున్నాయి. ఇలా రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు జనవరినాటికే అడుగంటిపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా వున్న కృష్ణా, గోదావరి, పెన్నా నదిపై వున్న మొత్తం ప్రాజెక్టు నీటి సామర్థ్యం 870 టిఎంసిలుకాగా, ఈ ఏడాది కేవలం 289 టిఎంసిలు మాత్రమే వుంది. ఇందులో నాగార్జునసాగర్‌లో డెడ్ స్టోరేజ్ నీటి నిల్వ 130 టిఎంసిలు, శ్రీశైలంలో 35 టిఎంసిలతోపాటు ఇతర ప్రాజెక్టుల్లోని డెడ్‌స్టోరేజ్ నీటి మట్టాలను తీసివేస్తే రాష్ట్ర అవసరాల కోసం వినియోగించుకునే నీటినిల్వలు చాలా తక్కువ. ఇపుడున్న కొద్దిపాటి నిల్వలను అయినా జాగ్రత్తగా వాడకపోతే తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితి వుంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


రైల్వే ఉద్యోగుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న వి.ఉమామహేశ్వరరావు

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
నూతన పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని రైల్వే ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలకు సిఐటియు తమ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. జాతీయ స్థాయిలో జాయింట్ ఫెడరేషన్ ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్, ఆల్ ఇండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయం వద్ద రైల్వే ఉద్యోగులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలనుద్దేశించి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. రైల్వే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ అధ్యక్షులు బి రామగుప్తా మాట్లాడుతూ.. ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ డివిజనల్ కార్యదర్శి లీల మాట్లాడుతూ.. కేంద్రం ప్రకటించిన నూతన పెన్షన్ విధానంలో ఉద్యోగులకు సామాజిక భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 40 ఏళ్లపాటు ఉద్యోగం చేసిన వారు రిటైర్డు అయ్యాక అతి తక్కువ పెన్షన్ ఇస్తే ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ఈ నూతన పెన్షన్ విధానం కేవలం కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే తెచ్చారని విమర్శించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసేదాకా ఈ ఉద్యమాన్ని అంచెలంచెలుగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ కోశాధికారి లక్ష్మి, నాయకులు సాములు, శేఖర్‌బాబు, ప్రసాద్, సుధీర్, భాను బాబు, షరీఫ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డులో మచ్చుకాయల చిచ్చు

- ముఠామేస్త్రీపై దాడి - కార్మికుల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


పరిపాలనా కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

గుంటూరు మిర్చి యార్డులో మచ్చుకాయలు (శ్యాంపిల్స్) తీయడాన్ని నిషేధించడంపై ముఠా కార్మికులు నిరసన తెలిపారు. వసంతరావు అనే ముఠా మేస్త్రీ మచ్చుకాయలు తీసుకువెళ్తుండగా ప్రయివేటు సెక్యూరిటీ గార్డులు అడ్డగించారు. వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వసంతరావుపై సెక్యూరిటీ గార్డు చేయి చేసుకున్నారు. దీంతో ముఠా కార్మికులు విధులు బహిష్కరించి గుంటూరు-సత్తెనపల్లి రోడ్డుపై బైఠాయించారు. అనంతరం పరిపాలనా కార్యాలయాన్ని ముట్టడించారు. యార్డు బయట గోడలకు ఉన్న వైసిపి నాయకుల ఫ్లెక్సీలను చించివేశారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, చైర్మన్ నిమ్మకాయల రాజ్‌నారాయణ తదితరుల ఫ్లెక్సీలను తొలగించారు. కొంతకాలంగా యార్డులో మచ్చు కాయల విషయంపై పాలకవర్గానికి ముఠా కార్మికులకు మధ్య వివాదం కొనసాగుతుంది. రైతుల అనుమతితోనే మచ్చుకాయలు తీసుకుంటున్నామని కార్మికులు వాదిస్తుండగా రైతులకు నష్టం చేకూర్చే పనులను అనుమతించబోమని చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ స్పష్టం చేశారు.
మచ్చుకాయల పేరుతో ఒక్కో బస్తాకు రెండు కిలోల వరకు ఉచితంగా తీసుకుంటున్నారని దీనిని ఆమోదించే ప్రసక్తే లేదని చైర్మన్ తెలిపారు. దీంతో వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన వివాదంలో ముఠా మేస్త్రీ వసంతరావుపై చెయ్యి చేసుకున్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులను తొలగించామని అధికారులు తెలిపారు.

ప్రయివేటీకరణ విరమించే వరకూ పోరాటం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చర్యలను విరమించే వరకూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం కొనసాగుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1064వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించుకునే వరకూ ఎన్ని కష్టాలు వచ్చినా వెరవకుండా ముందుకు కదలాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఉక్కును పరిరక్షించాలని ఇప్పటికే జాతీయ స్థాయిలో అన్ని పార్టీల ఎంపిలకు వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని, సొంత గనులు కేటాయిస్తామని పార్లమెంటులో ప్రకటన చేసే వరకూ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, పరంధామయ్య, గుమ్మడి నరేంద్ర, దాసరి శ్రీనివాస్, సత్యనారాయణ, ఎ.వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులు

- ఎన్నికల కమిషన్ సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
సార్వత్రిక ఎన్నికల్లో విధుల్లోకి ఉపాధ్యాయులను తీసుకోవాలని రాష్ట్ర అధికారులకు కేంద్ర ఎన్నికల కమిషన్ సూచించింది. రెండు రోజులపాటు విజయవాడలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రభుత్వం సూచించిన సిబ్బంది విధులకు సరిపోరని, వెంటనే ఉపాధ్యాయుల వివరాలు తీసుకోవాలని తెలిపింది. వారిని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులుగా నియమించాలని సూచించింది. దీంతో ఆయా జిల్లాల డిఇఒలు ఉపాధ్యాయులను గుర్తించే పనిలో పడ్డారు.

25 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలి : సిఎస్
సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛాయుత, పారదర్శక వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై గురువారం వెలగపూడి సచివాలయంలో డిజిపి, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగు స్టేషన్లు, వాటిల్లో సదుపాయాలను ఈ నెల 25 కల్లా పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాల విద్య, ఉన్నత, పురపాలకశాఖలకు చెందిన పాఠశాల భవనాలతోపాటు గిరిజన, సాంఘిక సంక్షేమ, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల్లో పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని కేంద్రాల వద్ద ర్యాంపులు పెట్టాలని, లైట్లు, ఫ్యాన్లు, ఫర్నీచర్, తాగునీరు, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. మద్యం అక్రమ రవాణా, పోలీసు బందోబస్తు, చెక్‌పోస్టుల ఏర్పాటు, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం, ఛార్జిషీట్ల ఫైలింగ్ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం డిజిపి మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని తెలిపారు.

టిడిపిలోకి వైసిపి నేతలు

- కండువా కప్పి ఆహ్వానించిన లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
కర్నూలు నియోజకవర్గానికి చెందిన వైసిపి నేతలు టిడిపిలో చేరారు. కర్నూలు 17వ డివిజన్ కార్పొరేటర్ కైపా పద్మాలతారెడ్డి, కెవి సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధినేత సుబ్బారెడ్డి, ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల అధినేత కైపా అశోక్‌కుమార్ రెడ్డి పార్టీలో చేరారు. టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లాలో టిడిపి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని వారికి లోకేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, టిడిపి నేత గౌరు వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

చంద్రబాబుపై తప్పుడు కేసులు : మాజీ మంత్రి ఆలపాటి
చంద్రబాబుపై సిఎం జగన్ తప్పుడు కేసులు నమోదు చేయించారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. వ్యవస్థలను అడ్డంపెట్టుకుని చంద్రబాబుపై జగన్ పెట్టించిన తప్పుడు కేసులన్నీ న్యాయ స్థానాల్లో వీగిపోతున్నాయని ఒక ప్రకటనలో తెలిపారు. సిఎం జగన్ ఇచ్చిన మాటపై ఎప్పుడూ నిలబడలేదని టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి విమర్శించారు. అహంకారంతో చంద్రబాబు, లోకేష్‌పై కేశినేని నాని నిందలేశారని మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ విమర్శించారు. దురాలోచన, దురుద్దేశం, ముందస్తు ప్రణాళికతోనే నాని టిడిపిని వీడి వైసిపిలో చేరారని టిడిపి నాయకులు శావల దేవదత్ విమర్శించారు.

హైకోర్టును ఆశ్రయించిన ఎంపి రఘురామ

ప్రజాశక్తి-అమరావతి
సంక్రాంతి పండగ సందర్భంగా తన నియోజకవర్గ ప్రజలను కలుసుకునేందుకు ఎపి వెళుతున్న తనపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించకుండా, అక్రమంగా అరెస్టు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఎంపి కనుమూరి రఘురామ కృష్ణరాజు హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు గురువారం ముగియడంతో తీర్పును శుక్రవారం వెలువరిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఎస్ భానుమతి ప్రకటించారు. పిటిషనర్‌పై 11 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక కేసులో పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారని, ఇప్పుడు ఎపికి వెళితే ఏదో ఒక కేసుపెట్టి అరెస్టు చేసే అవకాశం ఉందని ఆయన తరపున న్యాయవాదులు వాదించారు. పిటిషనర్ లేనిపోని ఆందోళనతో కేసు వేశారని ప్రభుత్వ తరపున న్యాయవాది ప్రతివాదన చేశారు. కొత్తగా కేసేమీ లేదని, ఈ పరిస్థితుల్లో సిఆర్‌పిసి సెక్షన్ 41ఎ నోటీసు ఇవ్వాలని కోరడం అర్థం లేదని, పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు.

టిడిపిలోకి కొలుసు, రక్షణనిధి..!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
కృష్ణా జిల్లాలోని ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలు టిడిపిలో చేరనున్నారు. పెనమలూరు, తిరువూరు ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కొక్కిల గడ్డ రక్షణనిధి పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు సమాచారం. వీరిద్దరికీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైసిపి టిక్కెట్లు నిరాకరించింది. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును పార్థసారథి శుక్రవారం హైదరాబాద్‌లో కలవనున్నట్లు తెలిసింది. ఈ నెల 18న జరగనున్న చంద్రబాబు 'రా.. కదలిరా' సభలో సారథితోపాటు రక్షణనిధి కూడా టిడిపి కండువా కప్పుకునే అవకాశం ఉంది.

వైసిపిలోకి తిరువూరు మాజీ ఎమ్మెల్యే స్వామిదాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్ వైసిపిలో చేరారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన తన సతీమణి సుధారాణితో కలిసి వైసిపిలో చేరారు. నల్లగట్ల స్వామిదాస్ 1994, 1999లలో టిడిపి తరపున రెండు పర్యాయాలు తిరువూరు నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 2004, 2009, 2014లో వరుసగా ఓడిపోవడంతో 2019లో టిడిపి నల్లగట్ల స్వామిదాస్‌కు టికెట్ ఇవ్వకుండా కెఎస్ జవహర్‌కు ఇచ్చారు. ఆ ఎన్నికల్లో కూడా టిడిపి ఓటమిపాలైంది. ఇటీవలే ఆయన కేశినానితో పాటు టిడిపికి రాజీనామా చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

- సిఎస్‌కు ఎపిజెఎసి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని ఎపిజెఎసి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఈ మేరకు గురువారం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కోరారు. విద్యుత్ సౌధలో జరిగిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ.. రెండు, మూడు రకాల పనులు చేస్తూ ఎనర్జీ అసిస్టెంట్లు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
మున్సిపల్ ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఎస్ జవహర్‌రెడ్డిని ఎపిఎంఇఇఎస్ నాయకత్వం కోరింది. గురువారం వెలగపూడి సెక్రటేరియట్లో సిఎస్‌ను బొప్పరాజు ఆధ్వర్యాన నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమైన 11 సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. బిల్ కలెక్టర్లను అడ్మిన్ సెక్రటరీ విధుల్లోంచి తొలగించాలని కోరారు.

స్వచ్ఛ నగరాల్లో విశాఖకు 4వ స్థానం

6, 8 స్థానాల్లో విజయవాడ, తిరుపతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
దేశంలో స్వచ్ఛత నగరాల్లో విశాఖపట్నంకు నాలుగో స్థానం లభించింది. దేశంలోనే అత్యుత్తమ స్వచ్ఛత నగరాల్లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఏడోసారి సత్తా చాటింది. 2023 ఏడాదికి గానూ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో... గుజరాత్‌లోని సూరత్‌తో కలిసి ఇండోర్ అగ్రస్థానాన్ని పంచుకుంది. నవీ ముంబాయి మూడో స్థానాన్ని సొంతం చేసుకుంది. నాలుగో స్థానంలో విశాఖపట్నం, ఆరో స్థానంలో విజయవాడ, ఎనిమిదో స్థానంలో తిరుపతి, తొమ్మిదో స్థానంలో హైదరాబాద్ నిలిచాయి.


కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, విఎంసి మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు

కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గురువారం నాడిక్కడ భారత్ మండపంలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులను ప్రదానం చేశారు. క్లీన్ సిటీస్, క్లీనెస్ట్ కంటోన్మెంట్, సఫాయిమిత్ర సురక్ష, గంగా టౌన్స్, బెస్ట్ పెర్ఫార్మింగ్ స్టేట్ కేటగిరీలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నగరాలకు ఆమె అవార్డులు అందజేశారు. జాతీయ స్థాయిలో 24, జోనల్ స్థాయిలో 20, రాష్ట్ర స్థాయిలో 54 ఇతర విభాగాల్లో కలిపి మొత్తం 110 అవార్డులను కేంద్రం ప్రదానం చేసింది. లక్ష లోపు జనాభా కలిగిన నగరాల కేటగిరీలో సస్వాద్, పటాన్, లోనావాలా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మధ్యప్రదేశ్‌లోని మోవ్ కంటోన్మెంట్ బోర్డు క్లీనెస్ట్ కంటోన్మెంట్ బోర్డుగా ఎంపికైంది. క్లీనెస్ట్ గంగా సిటీల్లో వారణాసి, ప్రయాగ్ రాజ్ మొదటి రెండు అవార్డులు గెలుచుకున్నాయి. ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్-2023 డ్యాష్ బోర్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం ముఖ్యమైన ముందడుగన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రాలు, పట్టణ స్థానిక సంస్థలు (యుఎల్‌బి) పనితీరును ప్రశంసించారు. 2023 ఏడాదిగాను 'వేస్ట్ టు వెల్త్' థీమ్ ఆలోచించాల్సిన కీలకమైన అంశమని గుర్తు చేశారు. వ్యర్థాల నుండి సంపదను సృష్టించాలన్నారు. 2030 నాటికి పర్యా వరణ పరంగా జీరో వేస్ట్ ప్రోగ్రాంను హైలైట్ చేయడానికి జి-20 లీడర్స్ ఢిల్లీ డిక్లరేషన్ కట్టుబడి ఉందన్నారు.
లక్ష కంటే ఎక్కువ జనాభా నగరాల్లో అత్యంత వేగంగా స్వచ్ఛత సాధిస్తున్న నగరాల్లో గుంటూరు రెండో ర్యాంకును సొంతం చేసుకుంది. లక్ష జనాభా ఉన్న రాష్ట్ర స్థాయి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నగరాల్లో (క్లీన్ సిటీ) పులివెందుల మొదటి స్థానంలో నిలిచింది.

జిహెచ్‌ఎంసికి క్లీన్ సిటీ అవార్డు
లక్ష జనాభా పైబడిన నగరాల్లో ఆల్ ఇండియా క్లీన్ సిటీ కేటగిరీలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) ఫైవ్ స్టార్ రేటింగ్‌తో 9వ స్థానాన్ని కైవసం చేసుకుంది.

రాష్ట్రానికి దక్కిన ఘనత : మంత్రి ఆదిమూలపు సురేష్
స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో ఏ రాష్ట్రానికి దక్కని ఘనత ఆంధ్రప్రదేశ్‌కు దక్కిందని మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో భాగంగా జాతీయ స్థాయిలో ఆరో ర్యాంకు సాధించినందుకు గాను కేంద్ర పట్టణ వ్యవహారాలశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, సెక్రటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ రూప మిశ్రా చేతుల మీదుగా రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంటు మంత్రి ఆదిమూలపు సురేష్, విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు 2023 ప్రదానోత్సవంలో అదనపు కమిషనర్ ప్రాజెక్ట్స్ కెవి సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ పి రత్నావళి, చీఫ్ ఇంజినీరు ఎం ప్రభాకర్‌రావు పాల్గొని ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న కె. ఉమామహేశ్వరరావు

హామీలను అమలు చేయకపోతే మళ్లీ ఉద్యమం

ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - విజయవాడ
ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకపోతే మళ్లీ ఆందోళనకు సిద్ధమవుతామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు హెచ్చరించారు. కార్మికులు ఐక్యతతో పలు సమస్యలను పరిష్కరించుకోగలిగారని తెలిపారు. మున్సిపల్ కార్మికులు సమ్మెను తాత్కాలికంగా విరమించిన నేపథ్యంలో సిఐటియు ఆధ్వర్యాన విజయవాడ ధర్నాచౌక్‌లో వందలాది మంది కార్మికులతో గురువారం సభ జరిగింది. ఈ సభలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. డ్రెయినేజీ, డ్రైవర్లు, మలేరియా తదితర విభాగాల కార్మికులకు వేతనాల పెంపునకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు వేతనంతో హెల్త్ అలవెన్సు కలిపి చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, మరణించిన కార్మికులకు పరిహారం పెంచిందన్నారు. ఇతర విభాగాల కార్మికుల వేతనాలు, కేటగిరీలు తదితర అంశాల పరిశీలనకు వారం రోజుల్లో నివేదిక ఇవ్వడానికి అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. మున్సిపల్ కార్మికులకు రద్దు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించడానికి అంగీకరించిందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు మరింత వేతన పెంపుపై ప్రభుత్వం మొండివైఖరి విడనాడలేదన్నారు. మరికొన్ని సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక వైఖరి అవలంభిస్తున్నా సిఐటియు, ఇతర సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెతో కార్మికుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం అంగీకరించక తప్పలేదన్నారు. యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కార్మికుల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం, కార్మికులందరికీ వేతన పెంపు తదితర అంశాలపై భవిష్యత్తులో పోరాటాన్ని వివిధ రూపాల్లో కొనసాగించాల్సి ఉంటుందన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాటంలో పాల్గొన్నందుకు అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని
కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం

(మొదటిపేజీ తరువాయి)
విఆర్ జ్యోతి ఈ విషయం ప్రకటించారు. 'అంగన్‌వాడీలు, హెల్పర్లు, మినీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని 'జగనన్నకు చెబుదాం' పేరుతో కోటి సంతకాలతో సిఎంకు వినతిపత్రం సమర్పిస్తాం' అని వారు చెప్పారు. 31 రోజుల నుండి సమ్మె జరుగుతోందని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఎస్మా నోటీసులను భోగి మంటల్లో వేసి తగులబెడతామని, సంక్రాంతిలోపు సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని తెలిపారు. పది సమస్యలు పరిష్కరించామని చెబుతున్నారని, వాటికి సంబంధించి కొన్ని జిఓలు ఇంతవరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. శుక్రవారం చర్చలు జరుపుతామని ఆహ్వానించి మరోవైపు షోకాజు నోటీసులు ఇస్తున్నారని, అర్ధరాత్రి అపరాత్రి అనకుండా ఇంటికి వచ్చి ఇళ్లలో వారిని నిద్రలేపి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. చర్యలు తీసుకోవడానికి అంగన్‌వాడీలపై ప్రజలెవరూ ఇంతవరకూ ఫిర్యాదులు ఇవ్వలేదని, ప్రజలు కూడా సహకరిస్తున్నారని అన్నారు. అయినా ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలంటూ నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికి నాలుగు దఫాలుగా చర్చలు జరిపారని, కీలకమైన గ్రాట్యుటీ, వేతనాల పెంపుపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. ప్రభుత్వం చర్చలకు పిలవడాన్ని ఆహ్వానిస్తున్నామని, అదే సమయంలో డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని కోరారు. ఇప్పటి వరకూ శాంతియుతంగా పోరాటం చేస్తున్నామని, తమకు ఎస్మా వర్తించదని తెలిసినా ప్రయోగించారని, దాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఎస్మా నోటీసులను భోగి మంటల్లో తగులబెడతామని వివరించారు. అంగన్‌వాడీల ఆందోళనలు ఇప్పటి వరకూ సిఎంకు తెలియదని చెబుతున్నారని, ఇటీవల సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వేతనాలు పెంచేందుకు సిఎం అంగీకరించడం లేదని అన్నారని చెప్పారు. సిఎంకు విషయమే తెలియనప్పుడు వేతనాలు పెంచలేమని ఎలా చెప్పారని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్ సుప్రజ, నాయకులు గజలక్ష్మి, రత్నకుమారి, ఎల్లారాణి తదితరులు పాల్గొన్నారు. సమ్మె 31 రోజులకు చేరుకున్న సందర్భంగా అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.

వైవి, రాంభూపాల్ సంఘీభావం
అంగన్‌వాడీల దీక్షా శిబిరానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాంభూపాల్ సంఘీభావం ప్రకటించారు. దీక్షలో, శిబిరంలో ఉన్న అంగన్‌వాడీలను ఉద్దేశించి వారు మాట్లాడారు. సమ్మెకు పార్టీ తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకులు రమాదేవి, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బాలాజీ, సిఐటియు కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు డివి కృష్ణ తదితరులు సంఘీభావం తెలిపారు.

అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం

- ఎపిఐఐసి చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం అని ఎపిఐఐసి చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయదుర్గం అభ్యర్థికి సంబంధించి పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేస్తామన్నారు. నియోజకవర్గ బాధ్యతలు చూసుకోమని చెప్పినందుకే తాను నాయకులు, కార్యకర్తలతో తాను సమావేశాలు ఏర్పాటు చేసి సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఎవరూ వైసిపిని వీడి ఇతర పార్టీలోకి వెళ్లలేదన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేసి వచ్చే ఎన్నికల్లో వైసిపి జెండాను రాయదుర్గంలో ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అధిష్టానం అప్పగించే ఏ బాధ్యతనైనా తాను నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందని పిఎంకిసాన్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా చెప్పుకుంటున్న ప్రధానమంత్రి కిసాన్ పథకం ప్రయోజనాలు రైతులకు అందడం లేదు. ఘనంగా లక్ష్యాన్ని ప్రకటించినప్పటికీ దానిలో 20 శాతం మందికి మాత్రమే రుణాలు అందాయి. వ్యవసాయం, పశు సంవర్ధకం, డెయిరీ, మత్స్య రంగాల్లోని రైతులకు పిఎం కిసాన్ ద్వారా ఘర్ ఘర్ కెసిసి అభియాన్ పేరుతో స్వల్పకాల రుణాలను ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 1.35 కోట్ల మంది రైతులకు ఈ రుణాలను అందించేందుకు నిర్ణయించారు. ఇందులో రాష్ట్రంలో 3,12,473 మంది రైతులకు రుణాలను అందించాలన్నది లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రాష్ట్రంలోని పలు బ్యాంకుల ద్వారా ఈ రుణాలను అందించాలన్నది ప్రణాళిక. అయితే ఇప్పటివరకు కేవలం 62,628 మంది రైతులకు మాత్రమే రుణాలు ఇచ్చినట్లు అధికారిక లెక్కలు. దీనికోసం బ్యాంకర్లు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినా పెద్దగా ఫలితం కనిపించలేదని చెబుతున్నారు.



కర్నూలు ధర్నా చౌక్ వద్ద కోలాటం ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఏలూరులో అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

సమ్మె విచ్ఛిన్నానికి నోటీసులు

- అంగన్‌వాడీలు ఇళ్ల వద్ద లేకుంటే కుటుంబసభ్యులకు అందజేత
- సమస్యలు పరిష్కరించకపోతే రాజకీయ పోరు : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న అంగన్‌వాడీలకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ సమ్మెను విచ్ఛినం చేసేందుకు యత్నిస్తున్నారు. నోటీసులకు తలొగ్గేది లేదని, సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీలు తేల్చి చెబుతున్నారు. అయితే అధికారులు మాత్రం అంగన్‌వాడీల కుటుంబసభ్యులకు, వారు లేకపోతే ఇంటి ఆవరణలోని తలుపులకు నోటీసులు తగిలించి వెళుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వారు చేపట్టిన సమ్మె గురువారంతో 31వ రోజుకు చేరుకుంది. చెవ్వులో పూలుపెట్టుకుని, ఒంటికాలిపై నిలబడి, కుర్చీలు నెత్తిన పెట్టుకొని నిరసన తెలిపారు

గుంటూరు జిల్లా మంగళగిరిలో సమ్మె శిబిరం నుంచి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను బెదిరించే అధికారులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్మాను అమలు చేసిన అన్ని ప్రభుత్వాలను ఉద్యోగులు ఇంటికి పంపించారని గుర్తు చేశారు. కోటి సంతకాలు సేకరణలో తాము పాలుపంచుకుంటామని తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ ప్రజాపోరు, బహుజన సమాజ్‌వాదీ పార్టీ, జనతాదళ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.



ప్రకాశం జిల్లా మార్కాపురంలో నోటీసులు అతికిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సందర్శించి, మాట్లాడారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మె రాజకీయ పోరాటంగా మారకముందే రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పండగ అనంతరం ఈ ఉద్యమం రాజకీయ రూపం తీసుకుంటుందని హెచ్చరించారు. అంగన్‌వాడీల్లో నూటికి 90 శాతం దళిత, బలహీన వర్గాల మహిళలేనని, ఆ మహిళలను తక్కువ అంచనా వేస్తే వారి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు రాసిన లేఖపై ఆయన సంతకం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం తదితరులు పాల్గొన్నారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సందర్శించి మద్దతు తెలిపారు. నెల రోజులుగా సమ్మె చేస్తుంటే వారి డిమాండ్లను నెరవేర్చాల్సిందిపోయి నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. అనకాపల్లి జిల్లాలోని పరవాడలో చెవిలో పువ్వులు పెట్టుకొని, సబ్బవరం, మునగపాక, నక్కపల్లి కేంద్రాల్లో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. అల్లూరి జిల్లాలోని విఆర్.పురం, రంపచోడవరం కేంద్రాల్లో నిరాహార దీక్షలు కొనసాగాయి.

బాపట్ల జిల్లా మార్టూరులో, ప్రకాశం జిల్లా మార్కాపురంలో పలువురు అంగన్‌వాడీల ఇళ్లకు షోకాజ్ నోటీసులు తగిలించారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలిలో షోకాజ్ నోటీసులను దగ్ధం చేశారు.తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం దీక్షా శిబిరం వద్ద 31 అంకె రూపంలో కూర్చొని నిరసన తెలిపారు.

నాయుడుపేటలో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట భిక్షాటన చేశారు. శ్రీకాకుళంలో జ్యోతిరావు పూలే పార్కు వద్ద 24గంటల నిరాహార దీక్షను కొనసాగించారు. విజయనగరం జిల్లా ఎస్.కోటలో కుర్చీలు నెత్తిన పెట్టుకొని నిరసన తెలిపారు. బొబ్బిలిలో సమ్మె శిబిరం వద్దకు ప్రభుత్వం పంపిన నోటీసులు పట్టుకొని పోస్టుమ్యాన్లు రావడంతో అంగన్‌వాడీలంతా నిరాకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరంలో చెంపలు వేసుకొని జగన్‌ను అవనసంగా గెలిపించామంటూ నిరసన తెలిపారు. కర్నూలు ధర్నా చౌక్ వద్ద, నంద్యాల, నెల్లూరులో రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్ల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.కాకినాడలో ఆశావర్కర్లు, అమలాపురంలో సిఐటియు నాయకులు హాజరై మద్దతు తెలిపారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో అంగన్‌వాడీ కేంద్రాలకు అధికారులు నోటీసులు అంటించారు.

అసెంబ్లీ నిర్వహణకు అన్ని శాఖల్లో మానిటరింగ్ సెల్

- నోడల్ అధికారుల నియామకాలు
- సాధారణ పరిపాలనశాఖ ఆదేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

శాసనసభ బడ్జెట్ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. శాసనసభ, శాసనమండలి సమావేశాలకు ప్రత్యేక మానిటరింగ్ సెల్స్‌ను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందుకుగానూ అన్ని ప్రభుత్వ శాఖల్లో విభాగాలు ఏర్పాటుచేయాలని సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వులు జారీచేసింది. వచ్చే నెలలో వార్షిక బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్నారు. దీనికోసం ఉభయ సభలను సమావేశపరచాల్సి ఉంటుంది. ఈ సమావేశాల సందర్భంగా ప్రతి శాఖలో మానిటరింగ్ సెల్స్‌ను ఏర్పాటుచేయడంతోపాటు, ఈ విభాగాలను సమన్వయం చేసుకునేందుకు నోడల్ అధికారులను కూడా నియమించాలని నిర్దేశించారు. ఉభయ సభల్లో సభ్యులు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానాలు సిద్ధంచేసేందుకు, పలు కీలక చర్యల్లో ప్రభుత్వం తరపున వివరాలు అందించేందుకు ఈ విభాగాలు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఆయా శాఖలు తమ మానిటరింగ్ సెల్ వివరాలు, నోడల్ అధికారుల వివరాలను తక్షణమే సమర్పించాలని సాధారణ పరిపాలన శాఖ కోరింది. శాసనసభ, శాసన మండలికి వేర్వేరుగా నోడల్ అధికారులను నియమిస్తూ, వారి ఫోన్ నెంబర్లు, మెయిల్ ఐడి వివరాలు కూడా సమర్పించాలని స్పష్టం చేసింది.

ఫిబ్రవరిలో బయో ఏషియా సదస్సు

హైదరాబాద్ : ఫిబ్రవరి 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు బయోఏషియా సదస్సు జరగనుంది. బయేఏషియా-2024 సదస్సు 21వ ఎడిషన్‌ను హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలో ఏర్పాటు చేస్తున్నారు. దీనికి హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొనే ఈ సదస్సు సన్నాహాలను తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం సమీక్షించారు. బయో ఏషియా సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం

- నిరసన కార్యక్రమాలకు యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని యుటిఎఫ్ వెల్లడించింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.18 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని తాము చేపట్టిన 36 గంటల దీక్షను అప్రజాస్వామికంగా ప్రభుత్వం భగ్నం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో కనీసం ప్రభుత్వం ప్రకటించలేదని పేర్కొన్నారు. ప్రతినెలా ఒకటిన వేతనాలు చెల్లించాలని, పిఆర్‌సి, డిఎలు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవులు తదితర బకాయిలు చెల్లించాలని పలుమార్లు కలిసి వినతిపత్రాలిచ్చామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఆర్థిక శాఖ అధికారులకు, మంత్రివర్గ ఉపసంఘంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న విద్యాశాఖ మంత్రికి ముందస్తుగా నోటీసులిచ్చి తాలూకా, డివిజన్, జిల్లా స్థాయిల్లో ధర్నాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో 9, 10 తేదీల్లో 36 గంటల ధర్నా చేపట్టామని గుర్తుచేశారు. ప్రశాంత వాతావరణంలో ధర్నా చేసేందుకు ప్రభుత్వం అనుమతించకపోగా, ఉపాధ్యాయులందరికీ నోటీసులు జారీ చేసి జిల్లాల్లో ఉపాధ్యాయులను నిర్బంధించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడకు తరలివచ్చిన వందల మంది ఉపాధ్యాయులను అరెస్టు చేసి అప్రజాస్వామికంగా పోరాటం అణచివేశారని పేర్కొన్నారు. తమ పోరాటానికి కొనసాగింపుగా వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని నిరసిస్తూ ఈ నెల 14న బోగి మంటల్లో దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. 19న అన్ని పట్టణాలు, తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని, జిల్లా కేంద్రాల్లో 24న నిర్వహించాలని కోరారు. 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

మార్కెట్లలో ఒడిదుడుకులు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో గురువారం ఒడిదొడుకులు చోటు చేసుకున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పవనాలతో తొలుత సూచీలు లాభాలతో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఉదయం సెన్సెక్స్ 71,907.75 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. ఓ దశలో 71,543 కనిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది. మరో దశలో 71,999.47 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. తుదకు 63.47 పాయింట్లు లాభంతో 71,721 వద్ద ముగిసింది.

నిఫ్టీ 28.50 పాయింట్లు పెరిగి 21,647కు చేరింది. 2,022 స్టాక్స్ రాణించగా.. 1,251 షేర్లు ప్రతికూలతను ఎదుర్కొనగా.. మరో 63 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి. నిఫ్టీలో హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్, బిపిసిఎల్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉండగా.. ఇన్ఫోసిస్, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌యుఎల్, విప్రో షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో హెచ్‌యూఎల్, విప్రో అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.7 శాతం చొప్పున పెరిగాయి.

గూగుల్‌లో మళ్లీ ఉద్వాసనలు..


- అమెజాన్ సిబ్బందిలోనూ ఆందోళన

న్యూయార్క్ : సెర్చింజన్ దిగ్గజం గూగుల్‌లో మళ్లీ ఉద్యోగులపై వేటు పడనుంది. ఎఐ డివిజన్‌లో ఉద్యోగులను ఇంటికి పంపించడానికి కసరత్తును ప్రారంభించింది. 2023లో టెక్ కంపెనీల్లో భారీగా ఉద్యోగాలు ఊడాగ.. 2024లోనూ గూగుల్, అమెజాన్ మరోమారు వేటు వేయనుందనే రిపోర్టులు టెకీలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. తాజాగా అల్ఫాబెట్ యాజమాన్యంలోని ఫిట్‌బిట్ సహ వ్యవస్థాపకుడు జేమ్స్ పార్క్, ఎరిక్ ఫ్రైడ్‌మాన్ సహా వందలాది ఉద్యోగులను గూగుల్ తొలగిస్తోంది. అదే విధంగా అగ్మెంటెడ్ రియాలిటీలో కూడా వందలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపించడానికి కసరత్తు ప్రారంభించింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణ, వ్యయ నియంత్రణ వ్యూహంలో భాగంగా తొలగింపులు చేపడుతుంది. హార్డ్‌వేర్ డివిజన్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ బృందాల్లోని ఉద్యోగుల సంఖ్యలో కోత పెట్టనుంది. వాయిస్ ఆధారిత గూగుల్ అసిస్టెంట్, ఎఆర్ హార్డ్‌వేర్ టీం, కంపెనీ సెంట్రల్ ఇంజనీరింగ్ ఆర్గనైజేషన్‌లో పనిచేసే వారిపై ప్రభావం పడనుందని తెలుస్తోంది. ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌లోనూ ఎంజిఎం స్టూడియో విభాగంలోని ఉద్యోగులు ఆందోళనలో పడ్డారు. ఇందులోని వందలాది మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో, ఎంజిఎం స్టూడియో విభాగం నుంచి వందల మంది ఉద్యోగులను తొలగించడానికి కసరత్తు జరుగుతోంది.

జగన్‌ను గద్దెదించేందుకు దళితులు సిద్ధం

- షర్మిలకు ఎపి కాంగ్రెస్ పగ్గాలు ఇవ్వొద్దు
- అమలాపురం నుంచి ఎంపిగా పోటీ : హర్షకుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి



ఎన్నో ఆశలు పెట్టుకున్న దళిత జాతి గత ఎన్నికల్లో జగన్‌కు బాసటగా నిలిచిందని, కాని వారి ఆశలపై సిఎం జగన్ నీళ్లు చల్లారని, అందుకే నేడు ఆయన్ని గద్దె దించేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారని అమలాపురం మాజీ ఎంపి హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ కళాశాల సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పేందుకు ఫిబ్రవరి 8న 'దళిత సింహ గర్జన' సభను బొమ్మూరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి 12న సన్నాహక సమావేశం నిర్వహిస్తామన్నారు. దళితులను సిఎం జగన్ ఎలా దగా చేశారో ఈ గర్జనలో ప్రజలకు వివరిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన వైఎస్.షర్మిలకు ఎపి కాంగ్రెస్ పగ్గాలు ఇవ్వొద్దని, ఆ రాష్ట్రంలో నిరాదరణకు గురైన ఆమె ఇక్కడెలా పనిచేయగలరని, ఎపిలో కాంగ్రెస్‌ను నడిపించే నాయకులు లేరా? అని ప్రశ్నించారు. తెలంగాణలో పుట్టానని చెప్పుకునే షర్మిలకు నాయకత్వం ఇస్తే బూడిదలో పోసిన పన్నీరవుతుందని వ్యాఖ్యానించారు. కుమారుడి వివాహ ఆహ్వాన పత్రిక ఇవ్వడానికి జగన్ ఇంటికి షర్మిల వెళ్లారని, ఆ సమయంలో జగన్‌తో ఆమె అరగంటకుపైగా మంతనాలు జరిపారని, దీని వెనుక మర్మమేమిటో తెలియదని.. ఇవన్నీ కాంగ్రెస్ అధిష్టానం గమనించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విశాఖ ఉక్కు పరిరక్షణ వంటివి కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాష్ట్ర ప్రజలు నమ్ముతున్నారని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో తాను అమలాపురం నుంచి ఎంపిగా పోటీ చేస్తానని తెలిపారు.

టిసిఎస్‌కు రూ.11,058 కోట్ల లాభాలు

- క్యూ3 రెవెన్యూలో 4 శాతం వృద్ధి
- అంచనాలు తప్పిన ఇన్ఫోసిస్

ముంబయి : దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 2 శాతం వృద్ధితో రూ.11,058 కోట్ల నికర లాభాలు సాధించింది. రెవెన్యూ 4 శాతం పెరిగి రూ.60,583 కోట్లుగా నమోదయ్యింది. త్రైమాసిక ఫలితాల సందర్భంగా ప్రతీ ఈక్విటీ షేర్‌పై తన వాటాదారులకు ప్రత్యేక డివిడెండ్ కింద రూ.18, మధ్యంతర డివిడెండ్ కింద రూ.9తో మొత్తంగా రూ.27 డివిడెండ్‌ను ప్రకటించింది. దీర్ఘకాలిక వృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగుతున్నామని టిసిఎస్ ఎండి, సిఇఒ కె కీర్తివాసన్ తెలిపారు. జనరేటివ్ ఎఐ పట్ల చాలా మందిలో ఆసక్తి ఉందన్నారు. తమ ఖాతాదారులకు ఈ రంగంలో సేవలందించడానికి చర్యలు చేపడతామన్నారు. కళాశాల క్యాంపస్‌లతోపాటు ప్రతిభా ఆధారిత నియామకాలు కొనసాగుతాయని కంపెనీ చీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ తెలిపారు. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ నికర ఆదాయం 8.2 శాతం పెరిగి రూ.11,735 కోట్లుగా నమోదయ్యింది. గురువారం బిఎస్ఇలో టిసిఎస్ షేర్ ధర 0.61 శాతం పెరిగి 3,736.20 వద్ద ముగిసింది.

ఇన్ఫోసిస్ లాభాల్లో 7 శాతం పతనం

దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు నిరాశపర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 7.3 శాతం పతనంతో రూ.6,106 కోట్ల నికర లాభాలతో సరిపెట్టుకుంది. ఈ సంస్థ రూ.6,200 కోట్ల లాభాలు నమోదు చేయవచ్చని పలు సంస్థలు అంచనా వేశాయి. నిపుణుల అంచనాలకు భిన్నంగా ఆర్థిక ఫలితాలు వచ్చాయి. ఇక నిర్వహణ లాభం కూడా 20.5 శాతం తగ్గింది. దీంతో ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సర రెవెన్యూ గైడెన్స్ రెండు నుంచి 1.5 శాతానికి, ఆపరేటింగ్ మార్జిన్ గైడెన్స్ 22 నుంచి 20 శాతానికి తగ్గించుకుంది. కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య 3,22,663 మందికి పడిపోయింది. గడచిన క్యూ3లో కంపెనీ రెవెన్యూ ఒక శాతం పెరిగి రూ.39,821 కోట్లకు చేరుకుంది. 2022-23 మూడో త్రైమాసికంలో రూ.38,318 కోట్ల ఆదాయం సంపాదించింది. ఇదే కాలంలో 320 కోట్ల డాలర్ల విలువైన పెద్ద ఒప్పందాలను కుదుర్చుకుంది. వాటిల్లో 71 శాతం కొత్త ఒప్పందాలు ఉన్నాయని ఇన్ఫోసిస్ పేర్కొంది.

సంపాదకీయం

ఇరుగు పొరుగు

ఇప్పటికే సరిహద్దు దేశాలతో భారత ప్రభుత్వానికి సత్సంబంధాలు కొరవడిన నేపథ్యంలో తాజాగా మాల్దీవులతో సరికొత్త వివాదం తలెత్తడం కలవరపరుస్తోంది. హిందూ మహాసముద్రంలో కేవలం ఐదు లక్షల జనాభా కలిగిన ఆ ద్వీప దేశంతో ప్రపంచంలో అతి పెద్ద జనాభా గల ఇండియా వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశ మవుతోంది. మాల్దీవులకు చెందిన ముగ్గురు ఉపమంత్రులు భారత ప్రధాని నరేంద్ర మోడీని టెర్రరిస్ట్ గా, విదూషకుడిగా అభివర్ణిస్తూ ఆయన ఇజ్రాయిల్ కు తొత్తు అన్న వ్యాఖ్యానాలను తమ వ్యక్తిగత సోషల్ మీడియా అకౌంట్లో పోస్ట్ చేశారు. అవి తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలనడంలో ఎలాంటి సందేహము లేదు. ప్రతి ఒక్కరూ వాటిని ఖండిస్తారు కూడా! అవి ఆ యా మంత్రుల వ్యక్తిగత వ్యాఖ్యలే తప్ప ప్రభుత్వ వైఖరి కాదు అని మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు స్పష్టం చేయడమే గాక తదనంతరం ఆ ముగ్గురిని మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేశారు. కాబట్టి ప్రధాని నరేంద్ర మోడీ పట్ల చేసిన వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమైనవే తప్ప మాల్దీవుల ప్రభుత్వం లేదా ఆ దేశ ప్రజలందరి అభిప్రాయంగా భావించడానికి ఎంత మాత్రమూ తావులేదు. అయినా మాల్దీవులకు భారత్ నుండి యాత్రికులు ఎవరూ వెళ్లరాదని విమాన సర్వీసులను రద్దు చేయడం వంటి తీవ్రమైన చర్యలు చేపట్టడం పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వంటివి. మాల్దీవులకు యాత్రికుల ద్వారా లభించేది ప్రధాన ఆదాయం. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం స్థూల ఆదాయంలో మూడవ వంతు యాత్రికుల నుండే లభిస్తోంది. పర్యాటకుల సంఖ్యలో తొలి రెండు స్థానాల్లో భారత్, రష్యా ఉన్నాయి. అంటే భారత యాత్రికుల నుండి లభించే ఆదాయం మాల్దీవుల ప్రజల జీవనోపాధికి ఎంతగానో తోడ్పడుతోంది. ముగ్గురు వ్యక్తులు తమ సోషల్ మీడియా ఎకౌంట్లలో చేసిన వ్యాఖ్యలకు ఆ దేశంలోని సామాన్య ప్రజానీకం పొట్టకొట్టడం భావ్యం కాదు. ఈ అంశంపై ఇప్పటికే మాల్దీవులలోని మన రాయబారి ఆ ప్రభుత్వానికి తీవ్ర అభ్యంతరాన్ని తెలియజేశారు. అంతేగాక ఢిల్లీలోని ఆ దేశ రాయబారిని విదేశాంగ శాఖ పిలిపించుకొని మందలించిన విషయం అందరికీ తెలిసిందే. మాల్దీవుల సర్కారు కూడా వెంటనే ఆ దుందుడుకు మంత్రులను బర్తరఫ్ చేయడంతో పాటు ఆ వ్యాఖ్యలు ప్రభుత్వానివి కావని స్పష్టం చేయడం దిద్దుబాటు చర్యల్లో ముఖ్యమైన అంశం. ఈ నేపథ్యంలో మాల్దీవులకు వెళ్లే భారత యాత్రికులను నిరుత్సాహపర్చడం, నిరోధించడం ఎవరికీ శోభస్కరం కాదు. అంతేగాక భారత రక్షణ రీత్యా కూడా మాల్దీవులు ఒక మిత్ర దేశంగా ఉండడం ఎంతో అవసరం. ఆ దేశానికి 1965లో స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండీ భారత్‌కు మిత్ర దేశంగానే ఉందన్న విషయం మరువరాదు. అయితే, ఇటీవలి ఎన్నికల తరువాత కొద్దిగా తేడాలు వచ్చిన మాట నిజం. తమ భూభాగంలో విదేశీ సేనలుండరాదన్న ఆ దేశ ప్రభుత్వ విధానాన్ని ఎవరూ పూర్తిగా తప్పుబట్టలేరు కదా! ఇప్పటికే పాకిస్తాన్, చైనా, మయన్మార్, నేపాల్ తదితర సరిహద్దు దేశాలతో భారత ప్రభుత్వ సంబంధాలు సజావుగా లేవు. ఇంకా చెప్పాలంటే చాలావరకు శత్రు పూరితమైనవే! ఇరుగుపొరుగు దేశాలతో ఇటువంటి పరిస్థితి ఏ దేశానికీ మంచిది కాదు. అందులోనూ విశ్వగురువులమని కితాబిచ్చుకుంటున్న సంఘ పరివార్ శక్తుల ప్రాబల్యంలోని ప్రభుత్వానికి అంతకన్నా తగదు. ఒకనాడు అలీన దేశాల కూటమికి నాయకత్వం వహించడం, బంగ్లాదేశ్ విముక్తికి అన్ని విధాలా కృషి చేయడం వంటివి భారత చరిత్రలో మరుపురాని ఘట్టాలు. ఆ చరిత్రను చెరిపివేసే విధంగా మోడీ ప్రభుత్వం ఇరుగుపొరుగు దేశాలతో వ్యవహరించడం తగదు. ఇప్పటికైనా మాల్దీవులతో సత్సంబంధాలు నెరపడానికి మోడీ ప్రభుత్వం పూనుకోవాలి. క్రీడాకారులు, సినీ నటులు, ఇతర సెలబ్రిటీలు కూడా జాతీయ దురభిమానానికి గురికాకుండా విశ్వ మానవ సౌభ్రాతత్వాన్ని అలవర్చుకోవడం అవసరం. క్రీడ, నటన విశ్వజనమైనవి. ఆ మాటకొస్తే అంతర్జాతీయ క్రీడా పోటీల ద్వారా, ప్రపంచ బాక్సాఫీస్ కలెక్షన్ల ద్వారా భారీ ఆదాయాలను పొందుతున్న విషయాన్ని ఎవరూ మరువ రాదు. ఇరుగుపొరుగు దేశాల ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలు, సత్సంబంధాలు ఎల్లవేళలా కలిగి ఉండడం సర్వశ్రేయోదాయకం.

మహనీయుల మాట



నిరంతరం వెలిగే సూర్యుణ్ణి చూసి
చీకటి భయపడుతుంది.
అలాగే ...
నిరంతరం శ్రమించేవాణ్ణి చూసి
ఓటమి భయపడుతుంది.
- స్వామి వివేకానంద

అంగన్‌వాడీలకు కార్మికవర్గం అండగా నిలవాలి

పోరాట స్ఫూర్తి



వి. రాంభూపాల్



గౌరవ వేతనంతో పని చేస్తున్న అంగన్‌వాడీల మీద, అందులో మహిళల మీద ఇంత నిర్బంధాన్ని, నిందారోపణలు చేస్తున్నారంటే రాబోయే రోజుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర రంగాల్లోని అసంఘటిత కార్మికులు చేసే ఉద్యమాల మీద ఎంతటి ఉక్కు పాదం మోపుతారో ఊహించవచ్చు. ప్రస్తుతం జరుగుతున్న సమ్మె అంగన్‌వాడీలదే కావచ్చు కాని ఆ సమ్మెను అణచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు భవిష్యత్ ఉద్యమాలకు ప్రమాదకరం. అంగన్‌వాడీల సమ్మెకు అండగా నిలవడం కేవలం అంగన్‌వాడీల వేతనాల పెంపుదలకే కాదు, రాబోయే ఉద్యమాలను కాపాడుకోవడానికి, కార్మిక హక్కులను ప్రభుత్వాలు హరించకుండా నివారించుకోవడానికి అత్యవసరం.

అంగన్‌వాడీల సమ్మెను అణచివేసేందుకు ప్రభుత్వం తుది ప్రయత్నాలకు సిద్ధమైంది. వేతనాల పెంపు అడగడమే నేరమైనట్లు ఎస్మా ప్రయోగించింది. పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు ఇచ్చి విధుల నుండి తొలగిస్తామని బెదిరిస్తున్నది. ఇప్పటి వరకు అంగన్‌వాడీలకే పరిమితమైన ఈ సమ్మె పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత చర్యలు ఆంధ్ర రాష్ట్ర కార్మిక, ఉద్యోగ వర్గాల ఉద్యమాలకు సవాళ్లుగా మారాయి. ఈ నిరంకుశ చర్యలను ప్రతిఘటించడం అంగన్‌వాడీలకే కాదు ఆంధ్ర రాష్ట్ర శ్రమజీవుల ఉద్యమాలకు జవన్మరణ సమస్య. నియంతృత్వానికి నిదర్శనంగా ఉన్న క్రూరమైన ఎస్మా చట్టాన్ని గౌరవవేతనంతో బతికే అంగన్‌వాడీల మీదే ప్రయోగించారంటే రానున్న రోజుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు హక్కుల గురించి, వేతనాల గురించి ఉద్యమించగలరా? అందుకే కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలతో పాటు సకల జనం...ఉద్యమిస్తున్న అంగన్‌వాడీలకు అండగా నిలవాలి. ప్రభుత్వ నిర్బంధాన్ని ఐక్యంగా ప్రతిఘటించాలి.

ఆంధ్ర రాష్ట్ర ఉద్యమాలకు ఊపిరిలూదుతున్న అంగన్‌వాడీల సమ్మె చారిత్రాత్మకం, సువర్ణాక్షరం. 30 రోజులుగా లక్ష మంది మహిళలు పట్టు సడలకుండా జగమొండి ప్రభుత్వంపై పోరాడుతుండడం అబ్బురం, ఆశ్చర్యం. ఎస్మా లాంటి పాశవిక చట్టాలను అడ్డుపెట్టి ఈ ఉద్యమ క్రాంతిని ఆపాలని చూస్తున్న పాలకులకు స్వప్నంలో కూడా వీడని కాళికలయ్యారు అంగన్‌వాడీలు. వేతనాల కోసం, చట్టబద్ధ సౌకర్యాల కోసం పోరాడుతున్న అతి బక్కజీవుల మీద బ్రహ్మాస్త్రం ప్రకటించిన ప్రభుత్వం అది తనకు భస్మాసురాస్త్రం అవుతుందని గుర్తించేలా చేయడం నేటి చారిత్రక అవసరం.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలు కోసం సమ్మె చేయాల్సి రావడం ఈ ప్రభుత్వ ద్వంద్వ విధానాలకు నిదర్శనం. రాష్ట్రంలో 55,605 సెంటర్లలో పనిచేస్తున్న లక్ష పదివేల మందికి పైగా అంగన్‌వాడీలు తమకు ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమని గత నాలుగు సంవత్సరాలుగా అన్ని పద్ధతుల్లో ఈ ప్రభుత్వాన్ని అడిగారు. ఏలికలు జాలి మాటలతో జోకొట్టాలని చూశారే గాని...కడుపు నింపే కాసులు విదల్చలేదు. సరికదా, గతంలో అమలవుతున్న ప్రభుత్వ పథాకాలకు మీరు అనర్హులు అని తేల్చారు. దీంతో అంగన్‌వాడీల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లైంది. కడుపు మండింది. సమ్మెకు దిగాల్సిన అనివార్య పరిస్థితిని ఈ ప్రభుత్వం సృష్టించింది. ఇందుకు వైసిపి ప్రభుత్వం సిగ్గుపడాల్సిందిపోయి ఎదురు దాడికి దిగింది. అబద్ధాలను ప్రచారం చేస్తున్నది. బెదిరింపులు, చివరకు తొలగింపులకు సిద్ధమైంది. సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలకు ప్రత్యామ్నాయం చూసుకుంటామని గాండ్రిస్తున్నది. దగ్గరలో ఎన్నికలు ఉన్నాయి కాబట్టి పాలకపక్ష క్రూరత్వం ముసుగులు వేసుకుని బుసలు కొడుతున్నదే తప్ప...ఆ ఎన్నికలే దూరంగా ఉంటే నిర్బంధం ఏ రకంగా ఉండేదో అంగన్‌వాడీలకు తెలియనిది కాదు.

అంగన్‌వాడీలపై నిర్బంధాలు-నిందారోపణలు

సమ్మె ప్రారంభమైన మొదటి రోజే సమ్మె చేయవద్దని ఐసిడిఎస్ కార్యదర్శి ద్వారా కార్మికులకు నోటీసులు పంపారు. నాలుగు రోజుల తర్వాత సెంటర్ల తాళాలు పగులగొట్టే విధ్వంసకర విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేశారు. అంగన్‌వాడీల సేవలు పొందుతున్న తల్లులు, ప్రజలు, సెంటర్లు బాడుగలకు ఇచ్చిన ఇంటి యజమానులు ఈ దుర్మార్గాన్ని ప్రతిఘటించడంతో అలాంటి ఆదేశాలు మేము ఇవ్వలేదని ప్రభుత్వ పెద్దలు కపటత్వం ప్రదర్శించేందుకు ప్రయత్నించారు. సచివాలయ సిబ్బంది ద్వారా సెంటర్లు నడపాలని చూశారు. చర్చల పేరుతో బుజ్జగింపులకు దిగారు. మీ కష్టం గొప్పదంటూనే 'వేతనాలు తప్ప' మిగిలిన వాటిని మాట్లాడుకుందామని చర్చలకు మోకాలు అడ్డువేశారు. తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తానన్న ముఖ్యమంత్రి హామీ గురించి సమ్మె చేస్తుంటే 'వేతనాలు తప్ప...' అంటే చర్చలకు అర్థం ఏముంది? ముఖ్యమంత్రి స్పందించడంలేదు కాబట్టి మంత్రులు, ఎమ్మెల్యేలకు చెప్పుకుందామని వారి ఇళ్ళ దగ్గరకు వెళ్తుంటే పోలీసుల ద్వారా అడ్డుకునే అన్ని ప్రయత్నాలు చేశారు. కాని వేలమంది మహిళలను అడ్డుకుంటే జరిగే పరిణామాలను ఊహించి వెనక్కు తగ్గారు. సమ్మె శిబిరాల దగ్గర పోలీసులను మోహరించి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. 'జనవరి 5 లోపు విధుల్లో చేరకపోతే...' అని హెచ్చరించారు. అధికారులు ప్రతిరోజూ మెసేజ్‌ల ద్వారా చేతనైనంత భయపెడుతూనే ఉన్నారు. ఇన్ని చేసి, 'గతంలో టిడిపి వారు గుర్రాలతో తొక్కించారు. మేము అలా చేశామా...?' అంటూ ప్రభుత్వ సలహాదారులు రాగాలాపన చేయడం మరింత విడ్డూరం.

ఈ సమ్మెల వెనుక జాతీయ రాజకీయపార్టీలు ఉన్నాయని, కమ్యూనిస్టులు ఉన్నారని, ఎవరో డబ్బులు ఇచ్చి సమ్మెను నడుపుతున్నారని దుష్ప్రచారం మొదలెట్టారు. ప్రతి ఉద్యమ సమయంలోనూ, ప్రతి సమ్మెలోనూ జరిగే తంతే ఇది. అధికారంలో ఎవరు ఉన్నా ఇవే పదాలను పదే పదే వల్లించడం చూసి జనం విసిగిపోయారు. అయినా ఏ జంకు లేకుండా నిస్సిగ్గుగా ఏలికలు వాటినే వాడేస్తుంటారు. అధికార పార్టీకి చెందిన సోషల్ మీడియా అసుర సైనికులు అనైతికమైన, అహేతుకమైన నిందారోపణలుతో పాటు, తల్లి తర్వాత తల్లిలాగా సేవలు చేస్తున్న అంగన్‌వాడీ తల్లులను దుర్భాషలాడుతూ దుర్మార్గంగా ప్రచారం చేస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు, వారి అనుచరులు తమ స్థాయి దిగజార్చుకుని మాట్లాడుతున్నారు. ఇలాంటి విమర్శల వెనుక కార్మికుల చైతన్యాన్ని గుర్తించ నిరాకరించడం, ఉద్యమాలకు అండగా నిలిచే కమ్యూనిస్టు పార్టీలను కార్మికుల నుండి దూరం చేయడమనే దోపిడీ వర్గ స్వభావం ఉంది. ప్రభుత్వం చేపట్టే నిర్బంధాలను, నిందారోపణలను అంగన్‌వాడీలు ఏ మాత్రం ఖాతరు చేయకపోగా, ప్రధాన ప్రతిపక్ష పార్టీల నేతలు సమ్మె శిబిరానికి వచ్చి ఆర్థిక సహాయం చేస్తామంటే నిర్ద్వంద్వంగా అంగన్‌వాడీలు నిరాకరించారు. భోజనాలైనా ఏర్పాటు చేస్తామంటే వద్దన్నారు. ఉద్యమ నిర్వహణకు కొంగుపట్టి ప్రజల వద్ద భిక్షాటన చేసి నిధులను సమీకరించుకున్నారు. ప్రతి రోజూ వంద నుండి రెండు వందల రూపాయలు చార్జీల ఖర్చు పెట్టుకుని సమ్మె శిబిరాల్లో కూర్చుంటున్నారు. ఇంటి నుండే క్యారేజీ తెచ్చుకుని ప్రతి రోజూ సహపంక్తి భోజనాలు చేస్తున్నారు. అక్కడికక్కడే పాటలు, నాటికలు రాసుకుని పాడుకుంటున్నారు. విచిత్ర వేషాలు, వినూత్న కార్యక్రమాలు చేస్తూ ఉద్యమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళుతున్నారు. ఇవన్నీ పాలకులకు కంటగింపుగా మారాయి. అందుకే 'ఎస్మా' అనే నల్లసర్పాన్ని బయటకు వదిలి అలజడి సృష్టించా లనుకుంటున్నారు.

అంగన్‌వాడీలకు అండగా...

గౌరవ వేతనంతో పని చేస్తున్న అంగన్‌వాడీల మీద, అందులో మహిళల మీద ఇంత నిర్బంధాన్ని, నిందారోపణలు చేస్తున్నారంటే రాబోయే రోజుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర రంగాల్లోని అసంఘటిత కార్మికులు చేసే ఉద్యమాల మీద ఎంతటి ఉక్కు పాదం మోపుతారో ఊహించవచ్చు. ప్రస్తుతం జరుగుతున్న సమ్మె అంగన్‌వాడీలదే కావచ్చు కాని ఆ సమ్మెను అణచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు భవిష్యత్ ఉద్యమాలకు ప్రమాదకరం. అంగన్‌వాడీల సమ్మెకు అండగా నిలవడం కేవలం అంగన్‌వాడీల వేతనాల పెంపుదలకే కాదు, రాబోయే ఉద్యమాలను కాపాడుకోవడానికి, కార్మిక హక్కులను ప్రభుత్వాలు హరించకుండా నివారించుకోవడానికి అత్యవసరం. నెల రోజులుగా పట్టుదలగా పోరాడుతున్న అక్కచెల్లెళ్లలో ఉద్యమ దీక్ష పెరుగుతుందే తప్ప తగ్గడంలేదు. ఇప్పుడు వారికి కావలసింది తోటి కార్మికుల, ఉద్యోగుల, ఉపాధ్యాయుల మద్దతు. సమ్మె శిబిరాల్లో నాయకుల మద్దతే కాదు, సంఘాల సభ్యుల భౌతిక మద్దతు, ప్రజల్లో ప్రచారం చేయడం ద్వారా వారి మద్దతు, ఆర్థికంగా సహకరించి అండగా నిలబడే సంఘీభావ మద్దతు కావాలి. ఈ ఉద్యమం జయప్రదమైతే ప్రత్యక్షంగా అది అంగన్‌వాడీలకు కొంత ఆర్థిక ప్రయోజనం కల్పిస్తుంది. కాని ప్రభుత్వం జయప్రదమైతే మొత్తం కార్మిక, ఉద్యోగ వర్గాలకే అత్యంత ప్రమాదకరంగా మారుతుంది.

అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సందర్భంగా విషాదకర సంఘటనలు జరిగాయి. సమ్మెకు మద్దతుగా నిలచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ రోడ్డు ప్రమాదంలో మరణించారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రాజెక్టు తరుణవాయి గ్రామానికి చెందిన వనమ్మ, అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ప్రాజెక్టు టి.కొత్తపల్లి ఆయా సుగుణమ్మ గుండెపోటుతో సమ్మె శిబిరాల్లోనే మరణించారు.


కమ్యూనిస్టులపై అక్కసు ఎందుకు?

ఉద్యమిస్తున్న వారికి అండగా నిలిచే కమ్యూనిస్టులపై అక్కసు వెళ్లగక్కడం పాలకులకు కొత్త కాదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మిక, ప్రజా పోరాటాల్లో పాల్గొనడం, కమ్యూనిస్టులను కీర్తించడం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాలను అణచివేయడం, కమ్యూనిస్టులను దూషించడం పాలకుల అనైతిక విధానం. ప్రతిపక్షంలో ఉంటే ప్రజాస్వామ్యం, చట్టం, న్యాయం అని గర్జించడం, అధికారంలోకి వచ్చిన తర్వాత అప్రజాస్వామికంగా వ్యవహరించడం వారి ఓట్ల రాజకీయాల స్వార్థ రీతి. అలా పూటకో రీతిగా కమ్యూనిస్టులు ఉండరు, ఉండలేరు. కాబట్టే కమ్యూనిస్టులంటే పాలకులకు భయం. ఢిల్లీలో జరిగిన రైతుల పోరాటమైనా గల్లీలో జరిగే అంగన్‌వాడీల సమ్మె అయినా ఉద్యమించే వారి పక్షాన నిలవడం కమ్యూనిస్టుల, ప్రజాతంత్రవాదుల బాధ్యత. అన్ని పార్టీలు ఓట్ల చుట్టూ తిరిగుతుంటే...ప్రజల కష్టాల చుట్టూ, వారు చేసే పోరాటాల చుట్టూ నిస్వార్థంగా అండగా నిలవడం మార్క్సిస్టుల నీతి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

విద్యార్థుల పార్లమెంట్ మార్చ్ ఎందుకు?

సందర్భం



టి. నాగరాజు

భారతదేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత విద్యపై దాడి ప్రమాదకరమైన స్థాయిలోకి చేరుకుంది. ఆర్ఎస్ఎస్ మద్దతుతో దేశ విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు పన్నుతున్నారు. దేశ విద్యారంగాన్ని కషాయీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దేశంలో వందేళ్ళ ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఫాసిస్టు ఆర్ఎస్ఎస్...మన విద్యారంగంలో ప్రజాస్వామ్య, లౌకిక, ప్రగతిశీల విలువలపై సంఘ పరివార్ శక్తులు మరింత దాడికి పూనుకునే ప్లాన్ చేస్తోంది.



జనవరి 12న దేశంలో 16 విద్యార్థి సంఘాలు మొదటి సారిగా 'యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా' పేరుతో 'మార్చ్ టూ పార్లమెంట్'కు పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యారంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా వేలాది మంది విద్యార్థులు ఢిల్లీ వీధుల్లో ఈ కార్యక్రమానికి పూనుకున్నారు. భారత దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత విద్యపై దాడి ప్రమాదకరమైన స్థాయికి చేరుకుంది. ఆర్ఎస్ఎస్ మద్దతుతో దేశ విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు పన్నుతున్నారు. దేశ విద్యారంగాన్ని కషాయీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. చివరకు పాఠ్యపుస్తకాల నుండి 'ఇండియా' అనే పేరును తొలగించే ప్రయత్నం ప్రారంభించారు. దేశంలో వందేళ్ళ ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఫాసిస్టు ఆర్ఎస్ఎస్...మన విద్యారంగంలో ప్రజాస్వామ్య, లౌకిక, ప్రగతిశీల విలువలపై సంఘ పరివార్ శక్తులు మరింత దాడికి పూనుకునే ప్లాన్ చేస్తోంది.

ఎన్ఇపి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

మన దేశంలో విద్యా హక్కును రాజ్యాంగంలోనే పొందుపర్చారు. బిజెపి నూతన విద్యా విధానాన్ని (ఎన్.ఇ.పి) అమలు చేస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కును కబళిస్తోంది. అందరికీ విద్య అందాలనే లక్ష్యంతో రాజ్యాంగ సవరణ చేసి మరీ చట్టం చేస్తే (విద్యాహక్కు చట్టం-2009)...మోడీ ప్రభుత్వం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కనీసం రాష్ట్రాలతో సంప్రదించకుండా పార్లమెంట్‌లో చట్టం చేసింది. రాష్ట్రాలకు సమాఖ్య హక్కులను కూడా లేకుండా నియంతృత్వ శాసనాలు చేసింది. ఎన్.ఇ.పి వలన పాఠశాలలు విలీనం, మూసివేత, దూర ప్రాంత హైస్కూళ్లకు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడి...డ్రాపవుట్లు పెరిగి విలువలు లేని శ్రామికులుగా బాలలు మారతారు. కేవలం పాఠశాల విద్య మాత్రమే కాదు. సిలబస్ రూపకల్పన, పరీక్షల విధానం, శిక్షణా కార్యక్రమాలను నూతన విద్యా విధానం రూపంలో కేంద్రం రాష్ట్రాల నుండి గుంజుకుంటున్నది. ఎన్.ఇ.పి వలన ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్య కేంద్రీకరణ చేసే సంస్కరణలను బిజెపి ఈ విద్యా విధానంతో తీసుకుని వస్తున్నది. పాఠశాల విద్యలో 3,4,5 తరగతుల విలీనం, సిబిఎస్ఇ సిలబస్ ప్రవేశ పెట్టడం, ఎన్.జి.వో ధార్మిక సంస్థలను అనుమతించడం, వాలంటీర్లను నియమించడం, హిందీ, సంస్కృతంను బలవంతంగా రుద్దడం, మల్టీ ఎగ్జిట్స్ పేరుతో పాఠశాల స్థాయి నుండి వృత్తి విద్య కోర్సులు, సిబిసిఎస్ అమలు, యూనివర్శిటీల వికేంద్రీకరణ, విదేశీ యూనివర్శిటీలకు ఆహ్వానం లాంటి సంస్కరణలు వలన మన దేశ విద్యారంగం ప్రభుత్వ బాధ్యత నుండి ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు బదలాయింపు చేసే కుట్రలు చేస్తూ బిజెపి విద్యను కార్పొరేటీకరిస్తున్నది. రాజ్యాంగ మౌళిక విలువలైన ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సమానత్వం, సాంస్కృతిక, భాషా వైవిధ్యం లాంటి వాటిని ఎన్.ఇ.పి విస్మరిస్తున్నది. విశ్వవిద్యాలయాలలో మహిళల రక్షణకు కమిటీలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, విద్యార్థి సంఘాల ఎన్నికలు, నిధుల కేటాయింపుల గురించి స్పష్టత లేకుండా దేశ విద్యా వ్యవస్థను విదేశీ, కార్పొరేట్ శక్తులకు బిజెపి అప్పజెప్పే కుట్రలు చేస్తున్నది. మూఢ విశ్వాసాలు, మత భావాలను ముఖ్యంగా మనువాద భావజాలాన్ని రుద్దేలా ఉన్నది. ప్రస్తుతం మాతృభాషతో పాటు ఇంగ్లీష్, హిందీ భాషలు అమలవుతున్నాయి. కానీ ఎన్ఇపి లో సంస్కృతం, హిందీని బలవంతంగా అమలు చేసే ప్రమాదమున్నది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ఆధునిక యుగంలో సంస్కృతం, హిందీ భాషలను నేర్చుకుని విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడతారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించకుండా యంత్రాలుగా తయారు చేసే విద్యావిధానాన్ని ఆర్ఎస్ఎస్ కనుసన్నలలో బిజెపి రూపొందించింది. ఇప్పటికే నూతన విద్యావిధానం అమలు చేస్తున్న రాష్ట్రాలలో అనుభవాలు కూడా చూస్తున్నాము. ఆంధ్రప్రదేశ్‌లో ఈ విద్యా సంవత్సరం 3 లక్షల 80 వేల మంది విద్యార్థులు డ్రాపవుటయి పాఠశాలకు దూరంగా ఉన్నారంటే ఎంతటి ప్రమాదం పొంచివున్నదో మనం అర్థం చేసుకోవచ్చు.

విశ్వవిద్యాలయాల బయట ఉన్న ప్రతి కళాశాల స్వయంప్రతిపత్తి గల కళాశాలగా మారాలనేటటువంటి వ్యవస్థాగత విషయాలు అనేకం ఈ విధానంలో ఉన్నాయి. 1986లో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విద్యావిధానంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసలు ఎజెండా అయిన విద్యా వ్యాపారీకరణ మాత్రం బేషుగ్గా అమలు జరిగింది. 1986 విధానం మాదిరిగానే ప్రస్తుత నూతన విధానంలో కూడా కొన్ని అనుకూల విషయాలతో పాటు పాలకుల ప్రధాన ఎజెండా కూడా ఉన్నది. ప్రధానంగా బిజెపి మతోన్మాదాన్ని, హిందుత్వ భావజాలాన్ని విద్యార్థుల మెదళ్లల్లోకి చొప్పించాలనుకుంటున్నది. తిరోగమన దిశలో నూతన జాతీయ విద్యావిధానాన్ని మోడీ ప్రభుత్వం రూపొందించింది. ఇది విద్య ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ కోసమే. ఇది పేద విద్యార్థులు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది.

విద్యారంగంపై కేంద్రం బుల్డోజర్

బిజెపి 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి చరిత్రను మార్చే చర్యలు ప్రారంభించింది. యుజిసి, ఎఐసిటిఇ తోపాటు ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విశ్వవిద్యాల యాలకు ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వారినే ఛైర్మన్,వీసీలుగా నియమిస్తున్నది. మనువాద భావజాలాన్ని విద్యారంగంలోకి చొప్పిస్తున్నది. అందుకనుగుణంగా సిలబస్ రూపకల్పన చేస్తున్న ది. భగవద్గీతను చదవాలంటూ పాఠ్యాంశాల్లో చేర్చుతున్నది.

మహాత్మా గాంధీ, అంబేద్కర్, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను పాఠ్యాంశాల నుంచి తొలగిస్తున్నది. ఆర్ఎస్ఎస్ నాయకులైన హెడ్గేవార్, వి.డి సావర్కర్ వంటి వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థులకు బోధిస్తున్నది. చరిత్రను వక్రీకరిస్తున్నది. గాంధీ జీవితం, ఆయన కృషి, గాంధీ హత్య, ఆర్ఎస్ఎస్ పై నిషేధం లాంటి అంశాలను తొలగించారు. కర్ణాటకలో టిప్పు సుల్తాన్, బసవన్న, పెరియార్ జీవిత చరిత్రలను తొలగించారు. ఎన్‌సిఇఆర్‌టి డార్విన్ సిద్ధాంతం, మొఘల్ చరిత్రలు లాంటి అంశాలను తొలగిస్తున్నారు. యూనివర్శిటీలలో ప్రశ్నిస్తున్న వారికి నోటీసులు ఇచ్చి బెదిరించడం, ప్రభుత్వ యూనివర్శిటీల ఫీజులు భారీగా పెంచడం చేస్తున్నారు. విద్యను కాషాయీకరించడం, పి.హెచ్.డి విద్యార్థులకు ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, స్కాలర్‌షిప్పులు అందించకుండా నిర్లక్ష్యం చేయడం, మధ్యాహ్న భోజనానికి నిధులు ఇవ్వకపోవడం ప్రధానంగా ప్రభుత్వ విద్యారంగంలోకి ప్రైవేటు, విదేశీ, కార్పొరేట్ శక్తులను ఆహ్వానించి తన బాధ్యత నుండి తప్పుకునే కుట్రలు చేస్తోంది. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వారిని వివక్షకు గురిచేస్తున్న చర్యలు తీసుకోకపోవడం, వివక్షను రూపుమాపేందుకు చర్యలు లేకపోవడంతో రోహిత్ వేముల లాంటి వారు ఉన్నత విద్యాసంస్థలలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వివక్షకు వ్యతిరేకంగా 'రోహిత్ యాక్టు' తేవాలని డిమాండ్ చేస్తున్నా కేంద్రం కనీసం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఐఐటీలు, ఐఐఎంలలో ఆదివాసీ, గిరిజన, దళితులకు చెందాల్సిన పోస్టులను భర్తీ చేయకుండా ఖాళీగా పెడుతోంది. ఉన్నత విద్యాసంస్థలలో విద్యార్థినులపై జరుగుతున్న లైంగిక దాడుల నివారణకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయకుండా బిజెపి నిర్లక్ష్యం చేస్తున్నది.

పెరుగుతున్న నిరుద్యోగం

మేం అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన బిజెపి ప్రభుత్వం ఏర్పడి పదేళ్లయినా ఉద్యోగాలు భర్తీ చేయడం లేదు. నేషనల్ శాంపిల్ సర్వే లెక్కల ప్రకారం నేడు దేశంలో 17 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. మోడీ ప్రభుత్వం రావడానికి ముందు 2013-14లో 4.9 శాతం ఉన్న నిరుద్యోగిత రేటు నేడు 7.28 శాతానికి చేరుకుంది. 75 సంవత్సరాల భారతావనిలో మొదటిసారి నిరుద్యోగిత రేటు ఈ స్థాయిలో పెరిగింది. గ్రామీణ నిరుద్యోగిత రేటు 10.82 శాతం, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు 8.44 శాతం ఉంది. ఈ ఖాళీలు భర్తీ చేయకుండా బిజెపి అంబానీ, అదానీ సేవలో తరిస్తున్నది. ప్రధానంగా బిజెపి పాలిత రాష్ట్రాలలోనే నిరుద్యోగం ఎక్కువగా ఉంది. మొన్న పార్లమెంటు సమావేశాల్లో 'పొగ బాంబు'లు విసిరి మరీ తమ నిరసన తెలిపిన యువకులు... నిరుద్యోగానికి వ్యతిరేకంగాను, రాజ్యాంగ రక్షణకు నినాదాలు చేశారు. అందుకే భారత దేశంలో ఉపాధిని గ్యారెంటీ చేయాలని విద్యార్థి, యువజనులు నిత్యం ఆందోళన చేస్తూనే ఉన్నారు. సంఘ్ పరివార్ దాడులకు వ్యతిరేకంగా దేశంలో విద్యార్థి ఉద్యమాలను నిర్మించాలని లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల వామపక్ష విద్యార్థి సంఘాలు జనవరి 12న 'సేవ్ ఎడ్యుకేషన్-సేవ్ ఇండియా', 'రిజెక్ట్ ఎన్.ఇ.పి-రిజెక్ట్ బిజెపి' నినాదంతో మార్చ్ టూ పార్లమెంట్ నిర్వహిస్తున్నారు. భవిష్యత్ భారతదేశాన్ని ఈ ఫాసిస్టు మూకల నుండి కాపాడుకునేందుకుగాను ప్రతి ఒక్కరూ పార్లమెంట్ మార్చ్‌కి మద్దతు తెలపాల్సిన అవసరం ఉంది.

/ వ్యాసకర్త ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి,
సెల్ : 9490098292/

కవిత్వం

చకోర పక్షులు

నిరుద్యోగుల చిరు జీవితాలు
నిరంతరం రగిలే వేదనాగ్నులు!
ఉపాధి వెన్నెల కోసం ఆకాశం లోకి
ఆశగా ఎదురు చూసే చకోర పక్షులు..!
ఏళ్ల తరబడి ఉద్యోగాలు దొరకక
ఉదర పోషణార్థం ఉన్న ఊర్లు విడిచి
వలస పోతున్నారు కలతల కూలీలై..!?
ఉన్నత చదువు పూర్తి కాగానే
డిగ్రీ పట్టాలు చేతికి అందగానే
విద్యార్థులు నిరుద్యోగులుగా మారి
చిరుద్యోగాలు కోసం వెతుకులాట ..!
కంపెనీలు చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా
పోటీ పరీక్షలను కష్టపడి తెగ రాసినా
ఉద్యోగ యోగం వారిని వరించక
నిర్వేదంతో బతుకుతున్న నిర్భాగ్యులెందరో..?
పాలకులు ప్రతి ఏటా ప్రకటిస్తామన్న
జాబ్ కాలెండర్ ప్రకటనకు జవాబుదారీ
లేదు..?
రాష్ట్రాలలో పారిశ్రామికీకరణ విస్తరణ
మృగ్యం ..?
హోదా లేదా రికమండేషన్ వుంటే తప్ప
జాబ్ జవరాలు జాడ తెలియని పరిస్థితి..!?
స్వర్ణ భారతంలో ఏటేటా చదువుకుని
నిరుద్యోగుల శాతం నిలువెత్తుగా
పెరుగుతున్నది..!
ఏలికల కున్న రెండు నాలుకల విధానాల వల్ల
ప్రభుత్వ సంస్థలు పర్మినెంట్‌గా మూత
పడుతుంటే
నిరుద్యోగులు అనునిత్యం పెరుగుతూ
భారతమ్మకు పెను భారంగా మారారు..!?
ఇదేనా..మన నవయుగ భారతం..?
ఇంతేనా..నిరుద్యోగుల జీవితాలు..!?
వారి విలువైన చదువులు చివరికి
చట్టుబండలేనా..?

– జి.సూర్యనారాయణ,
సెల్ : 6281725659.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ప్రభు భక్తి పెరగడంపై వాసుదేవన్ విమర్శలు



కేరళ సాహిత్య వేడుక ప్రారంభ సభలో ముఖ్యమంత్రి పినరయి విజయన్, వాసుదేవన్ తదితరులు

కోజికోడ్ : అధికారంలో వున్న రాజకీయ నేతలను 'ఆరాధించడం'పై జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ఎం.టి.వాసుదేవన్ నాయర్ తీవ్రంగా విమర్శించారు. మార్క్సిస్ట్ మేధావి, కేరళ మొదటి ముఖ్యమంత్రి ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ హయాంలో దీనికి వ్యతిరేకంగా ఆయన తీసుకున్న వైఖరిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కోజికోడ్‌లో నాలుగు రోజుల పాటు జరుగనున్న కేరళ సాహితీ ఉత్సవాలను గురువారం ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కీలకోపన్యాసం చేస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అధికారంలో వున్నవారు తమ పదవులను సామాజికాభివృద్ధి కోసం ఉపయోగించాలని ఆయన పిలుపిచ్చారు.

ఇ.ఎం.ఎస్ చాలా గొప్ప, గౌరవనీయమైన నేత అని, 1957లో ఎన్నికల ద్వారా కమ్యూనిస్టు పార్టీకి దక్కిన అధికారమనేది ఒక అవకాశమని, ఆ పార్టీకి ఓటు వేసిన ప్రజలతో బాధ్యతాయుతమైన సమాజాన్ని నిర్మించేందుకై గొప్ప ఉద్యమాన్ని రూపొందించేందుకు ఇదొక ప్రారంభమని ఆయన భావించేవారని వాసుదేవన్ నాయర్ గుర్తు చేసుకున్నారు. సాహిత్యం పట్ల తన దృక్పథంలో తాను చేసిన తప్పులను ఆయన అంగీకరించినపుడు కొంతమంది ఆయన్ను ఎగతాళి చేశారని అన్నారు.

"రాజకీయాల్లో లేదా సామాజిక, సాంస్కృతిక రంగాల్లో మన ప్రముఖులు తప్పులు చేశామని భావించినపుడు వారి తప్పులను అంగీకరించడమనేది సాధారణంగా మనం వినని విషయం. అలాగే నేను కూడా ఇఎంఎస్ తన ప్రత్యర్థులను ఎదుర్కొనడానికి వాదనల కోసం వెతుకుతున్నప్పుడు తన సొంత అభిప్రాయాన్ని రూపొందించుకోవడాన్ని ప్రారంభించడం చూసి చాలా ఆశ్చర్యపోయాను. అభిప్రాయాలు రూపొందించుకోవడం ఆరంభించడం చెప్పడం గొప్ప విషయం, కానీ ఆయన తన శోధనను ఎన్నడూ ఆపలేదు." అని వాసుదేవన్ నాయర్ పేర్కొన్నారు. 'కొంతమంది నేతలు' చాలా మంది ఇతరులను నడిపించేందుకు ఎప్పుడూ నాయకత్వం వహిస్తారనే భావనను కూడా మార్చుకోవాలని ఇఎంఎస్ చాలా ప్రయత్నించారని ఆయన గుర్తు చేసుకున్నారు. అందువల్లే నేతల పట్ల ప్రభుత్వ ఆయనలో కనిపించిందని అన్నారు.

అంతకుముందు ప్రారంభోపన్యాసం చేస్తూ విజయన్, సాహితీ ఉత్సవాల్లో జరుగుతున్న ప్రసంగాలు, చర్చలు, సమాలోచనలు విజ్ఞానధారిత ఆర్థిక వ్యవస్థగా కేరళ ఆవిర్భావానికి దోహదపడతాయని అన్నారు. లౌకిక, ప్రగతిశీల, ప్రజాతంత్ర దృక్పథాన్ని యువత రూపొందించుకోవడానికి కూడా ఇవి దోహదపడతాయన్నారు.

శక్తివంతమైన పాస్‌పోర్ట్ జాబితాలో

భారత్‌కు 80 స్థానం

- హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ నివేదిక

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్టులను కలిగి ఉన్న దేశాల జాబితాల్లో భారత్ 80వ స్థానంలో ఉన్నది. ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, జపాన్, సింగపూర్‌లు మొదటి ఆరు స్థానాల్లో ఉన్నాయి. తాజాగా విడుదలైన హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2024 నివేదిక ఈ ర్యాంకులను వెలువర్చింది. ఈ నివేదిక సమాచారం ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 227 దేశాల జాబితాలో మొదటి ఆరు దేశాలు (పైన పేర్కొన్నవి) వాటి పాస్‌పోర్ట్‌లతో 194 దేశాలకు వీసా లేని ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. గత ఐదేళ్ల నుంచి రెండు ఆసియా దేశాలు సింగపూర్, జపాన్ లు అగ్రస్థానంలో నిలవటం గమనార్హం. ఆ తర్వాత దక్షిణ కొరియా, ఫిన్లాండ్, స్వీడన్ దేశాల పాస్‌పోర్ట్‌లతో 193 దేశాలకు సులభంగా వెళ్లవచ్చు. ఇక 80వ స్థానంలో ఉన్న భారత పాస్‌పోర్టుతో వీసా లేకుండానే 62 దేశాలకు వెళ్లే అవకాశం ఉన్నది. ఇది గతేడాది 59 దేశాలకు మాత్రమే ఉన్నది. ఇక, హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో చివరి స్థానంలో ఆఫ్ఘనిస్తాన్ (104వ ర్యాంకు) ఉన్నది.

నౌకాదళంలో అదానీ డ్రోన్లు !

న్యూఢిల్లీ : అదానీ గ్రూపులోని డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ విభాగం తయారు చేసిన డ్రోన్లు భారత నౌకాదళంలో చేరాయి. దేశీయ పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసిన మానవ రహిత దృష్టి-10 ఏరియల్ వెహికల్ (డ్రోన్)ను నౌకాదళ ప్రధానాధికారి ఆర్.హరికుమార్ హైదరాబాదులో ఆవిష్కరించారు. దీనిని అదానీ ఎలోస్పేస్ పార్కులో తయారు చేశారు. ఈ డ్రోన్ సుమారు 450 కిలోల బరువును మోస్తుంది. ఆకాశంలో 36 గంటల పాటు ప్రయాణించగలదు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకుంటుంది. హిందూ మహా సముద్రంలోని వ్యూహాత్మక జలాల్లో నిఘా వేసే ఉందేందుకు ఈ డ్రోన్ ఉపకరిస్తుంది. దీనిని గుజరాత్‌లోని పోర్‌బందర్‌కు తరలించి నౌకాదళానికి అప్పగిస్తారు. ఈ డ్రోన్ తయారీలో ఉపయోగించిన పరికరాల్లో 70% దేశీయంగా ఉత్పత్తి అయినవే. దృష్టి-10 డ్రోన్ ఇజ్రాయిల్ ఎల్బిట్ సిస్టమ్స్‌కు చెందిన హెర్మెస్-900 యూఏవీ తరహాలో ఉంటుంది. ప్రస్తుతం మన నౌకాదళం వద్ద వ్యూహాత్మక డ్రోన్లతో పాటు సీ గార్డియన్ పేరుతో ఉన్న నాలుగు హెచ్ఏఎల్‌ఈ డ్రోన్లు కూడా ఉన్నాయి. నాలుగు దృష్టి-10 డ్రోన్ల కోసం ఆర్డర్ ఇచ్చామని, వీటిలో రెండు నౌకా దళానికి, మరో రెండు సైనిక దళానికి ఉద్దేశించామని, అయితే 150 ఎంఏఎల్ఈ డ్రోనర్లను కొనుగోలు చేయాలని సైన్యం యోచిస్తోందని రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. అరేబియా సముద్రంలో ఇటీవలి కాలంలో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో భారత నౌకాదళం ఇప్పటికే యుద్ధ నౌకల సంఖ్యను పెంచింది. అరేబియా సముద్రంలో, గల్ఫ్ ఆఫ్ అదెన్‌లో పది యుద్ధ నౌకలను మోహరించింది.

ఆళ్లగడ్డ సీటు నాకే

- మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆళ్లగడ్డ అసెంబ్లీ సీటు తనకేనని, గెలిచి చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇస్తామని టిడిపి నాయకులు మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ ప్రకటించారు. గురువారం నంద్యాల జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భూమా అఖిల ప్రియ మాట్లాడారు. ఆళ్లగడ్డ సీటు తనకేనని చంద్రబాబు నాయుడు చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు. నంద్యాల టికెట్ ఎవరికిచ్చినా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేసి గెలుపు కోసం పని చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ సారి ఎలాగైనా చంద్రబాబును సీఎంగా చేయాలన్నదే లక్ష్యంగా అహర్నిశలు కష్టపడి పని చేస్తామన్నారు. ఈ నెల 9న ఆళ్లగడ్డలో జరిగిన రా కదలి రా టిడిపి బహిరంగ సభకు దాదాపు 70 వేల మంది వచ్చారని, సభ విజయవంతం కావడానికి కృషి చేసిన పార్టీ రాష్ట్ర,జిల్లా నాయకులకు కార్యకర్తలకు, అభిమానులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నాయుడును స్వచ్ఛందంగా చూడటానికి కదలి వచ్చారని ఆమె తెలిపారు. 25 యేళ్లలో ఇంత జనం రావడం ఇదే తొలిసారి అని అన్నారు.

సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలి

- వ్యకాసం ఆధ్వర్యంలో మంత్రి ఉష శ్రీచరణ్‌కు వినతి

ప్రజాశక్తి-రొద్దం

సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ గురువారం మంత్రి ఉషశ్రీచరణ్‌కు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం భూ సాధన కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కోగిర రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 669లో సాగులో ఉన్న పేదలకు అసైన్‌మెంట్ కోసం చర్యలు తీసుకోవాలని కమిటీ అధ్యక్షురాలు అనిత అధ్యక్షతన కోగిర గ్రామసభలో పాల్గొన్నా మంత్రికి వినతి పత్రం అందించామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని కోగిర, శ్యాపురం, కంబాలపల్లి, బొక్సంపల్లి, బీదానుపల్లి గ్రామాలకు చెందిన దళిత, గిరిజన, బలహీన వర్గాల భూమి లేని నిరుపేదలు(కందులు, జొన్నలు, కొర్రలు) పంటలు సాగు చేస్తున్నారని, వీటిని అసైన్‌మెంట్ చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి అధికారులతో సమాచారం తీసుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రామాంజనమ్మ, రమణమ్మ, చిన్న అంజనప్ప, లక్ష్మి, నాగమణి, అశోక్, 50 మంది బాధితులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లకు ససేమిరా..

- ఉచిత విద్యుత్‌కు మంగళం
- బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ముందుకు రాని రైతులు



ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల ఏర్పాటుకు కోసం శ్రీకారంచుట్టే చేస్తోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ మీటర్ల ఏర్పాటును అంగీకరించేది లేదంటూ రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందని ట్రాన్స్‌కో అధికారులే స్వయంగా చెబుతున్నారు. రైతు సంఘాలు, విపక్షాలు మొదటి నుండీ వ్యవసాయ పంపు సెట్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రైతుల నుండి విద్యుత్ బిల్లుల వసూలు చేయనున్నపుడు మీటర్ల ఏర్పాటు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. రైతు సంఘాలు, రైతుల నుండి పెద్దఎత్తున వ్యతిరేకత వస్తుండటంతో మీటర్ల ఏర్పాటుకు బ్యాంకు ఖాతాల తెరిపించేందుకు ట్రాన్స్‌కో అధికారులు తంటాలు పడాల్సివస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వ్యవసాయ సర్వీసులు 2,98,234 ఉన్నాయి. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు తీవ్రప్రయత్నాలు చేస్తున్నా రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొవాల్సి వస్తోంది. బ్యాంకు ఖాతాలు తెరిపించేందుకు రైతుల వ్యక్తిగత వివరాలు అందించడం లేదు. ఖాతాలు తెరిపించడం పూర్తిచేసిన వెంటనే మీటర్లు బిగిస్తారనే భయంతో రైతుల్లో నెలకొంది. ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకే ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు పూనుకుంటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని రైతులు మీటర్ల ఏర్పాటుపై వ్యగహం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో ఆందోళన

ఖాతాలు తెరిపించే ప్రయత్నంలో భాగంగా రైతులు అడిగే ప్రశ్నలకు అధికారులు, సిబ్బంది సమాధానాలు చెప్పలేకపోతున్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించని పక్షంలో తమ ఖాతాల నగదును జరిపి చేసుకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. బిల్లులు తామే చెల్లిస్తామంటున్న ప్రభుత్వం భవిష్యత్తులో హామీపై నిలబడుతుందన్న నమ్మకం ఏమిటని నిలదీస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం మారితే కొత్త ప్రభుత్వం కట్టుబడి ఉంటారా అనే నమ్మకం లేదంటున్నారు. వీటికి సమాధానాలు చెప్పలేక విద్యుత్‌శాఖ అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

బ్యాంకు ఖాతాలు కీలకం

- పద్మనాభ పిళ్లై, ట్రాన్స్‌కో ఇఇ చిత్తూరు

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేయాలంటే రైతులు తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలు తెరిపించాలి. వ్యక్తిగత వివరాలు ఇవ్వడం లేదు. మీటర్లు ఏర్పాటుకు పై నుండిఆదేశాలు వస్తున్నాయి. మీటర్ల ఏర్పాటు కోసం రైతులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నాం. రైతుల అంగీకారంతోనే మీటర్లు ఏర్పాటు చేస్తాం.

పోక్సో కేసులో నిందితుడికి 21ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని ఎల్.కోట పోలీసు స్టేషనులో 2019 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన వేపాడ మండలం రామస్వామిపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గుడే కోటేశ్వరరావు (36)కు 21 సంవత్సరాలు కఠిన కారా శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి గురువారం తీర్పు చెప్పారని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు.

రామస్వామిపేటకు చెందిన నిందితుడు గుడే కోటేశ్వరరావు ఒక బాలికపై లైంగిక నేరంకు పాల్పడినట్లుగా బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో ఎల్.కోట పోలీసు స్టేషనులో 2019లో కేసు నమోదైంది. డిఎస్‌పి డి. సూర్య శ్రావణ్ కుమార్ దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. అట్రాసిటీ చట్టం సెక్షన్ 3(1)(డబ్ల్యు)(1) ప్రకారం నేరానికి పాల్పడినందుకు ఒక ఏడాది జైలు, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్‌పి ఈ సందర్భంగా అభినందించారు.

ఆగని దోపిడీ

- అక్కరకురాని అధికారులు
- కంటతడి పెడుతున్న ధాన్యం రైతులు
- కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ధాన్యం క్రయ, విక్రయాల్లో దోపిడీ ఆగడం లేదు. తూకంలో తేడా, ధరలో దగా షరా మామూలుగా సాగుతోంది. దోపిడీని అరికట్టి రైతులకు బాసటగా నిలవాల్సిన ఉన్నతాధికారులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల మిల్లర్లకు వంతపాడుతున్న సందర్భాలూ తారసపడుతున్నారు. దీంతో, తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ధాన్యం రైతులు కంటతపడి పెడుతున్నారు. కాస్తంత చొరవ ఉన్నవారు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఫిర్యాదులు చేశారు. ప్రతి ధాన్యపు గింజా దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు చేస్తామంటూ ఇటు అధికారులు, అటు ప్రభుత్వం ప్రగల్భాలాలు పలికిన సంగతి తెలిసిందే. ఈ మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ మాత్రం గడపదాటడం లేదు.

- గంట్యాడ మండలం బుడతనాపల్లికి చెందిన చల్లా రామునాయుడు కౌలు రైతు. అదే మండలంలోని కనక దుర్గ రైస్ మిల్లుకు 140 బస్తాలు, శ్రీరాధా కృష్ణ ఆగ్రో ఫుడ్స్‌కు 90 బస్తాలు, వెంకటరమణ రైస్‌మిల్లుకు 136 చొప్పున మొత్తం 366 ధాన్యం బస్తాలు విక్రయించాడు. ప్రతి బస్తాలోనూ 42 కేజీల చొప్పున తూకం వేసి, లెక్క మాత్రం 40కేజీలకే కట్టారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర 40కేజీల బస్తా ధాన్యం 'ఎ'గ్రేడ్ రూ.881.20, సాధారణ రకం రూ.873.20 గా ఉంది. కేజీ సుమారు రూ.22 చొప్పున లెక్కిస్తే రాము నాయుడు వద్ద 366 బస్తాలపై ఆయా మిల్లుల యాజమాన్యాలు రూ.8.062 వరకు దోచుకున్నట్టుగా అర్థమౌతోంది. మిల్లు యాజమాన్యాలు తనను నిండా ముంచేశాయంటూ రామునాయుడు ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు.
- జామి మండలం తానవరం గ్రామానికి చెందిన సిరికి చంద్రరావు స్థానిక సూర్యరాజా రైస్ మిల్లుకు 6టన్నుల 240కేజీల ధాన్యాన్ని విక్రయించాడు. మిల్లు యాజమాన్యం, ప్రభుత్వ సిబ్బంది చూపుతున్న లెక్క మాత్రం 6టన్నులే. దీన్నిబట్టి టన్నుకు 4కేజీల చొప్పున మినహాయించినట్టు స్పష్టమౌతోంది. ఇదేం అన్యాయం అంటూ మిల్లు యాజమాన్య సిబ్బంది, అక్కడి కస్టోడియన్ ఆఫీసర్లను అడిగితే అందరి వద్దా 2కేజీల నుంచి 4కేజీల వరకు అదనంగా తీసుకుంటారని, తరుగు ఉంటుంది కాబట్టి ఆమాత్రం తప్పదని చెప్పారు. అంతే కాదు. ధాన్యం మొత్తం ఒకేసారి నూర్పుచేసి, ఐదు ట్రాక్టర్లతో తీసుకెళ్లగా ఆర్‌బికె సిబ్బంది పూర్తి తేమశాతం ఉన్నట్టు గుర్తించారు. కానీ, మిల్లు వద్దకు వెళ్లేసరికి ఒక ట్రాక్టర్ లోడుకి తేమ శాతం తక్కువగా ఉన్నట్టుగా చెప్పి ధర తగ్గించారు. ఇతను కూడా తనను కలిసిన ప్రజాశక్తి ఎదుట తీవ్రంగా విలపించాడు. కేవలం రామునాయుడు, చంద్రరావు మాత్రమే కాదు. జిల్లాలో 90శాతం రైతులది ఇదే వ్యథ. ప్రభుత్వానికి విక్రయిస్తే మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారని, ప్రైవేటు వ్యాపారులకిస్తే రూ.200 తక్కువ ధరకు లాగేస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటీ తహశీల్దార్ కూడా అదనపు ధాన్యం ఇవ్వాల్సిందే అన్నారు...

- భూమిరెడ్డి అప్పారావు, వసాది, గంట్యాడ మండలం

ఏం చేస్తాం బాబు... మా బాధలు ఎవరికి చెప్పుకుంటాం... ఎవరికి చెప్పినా మా బాధలు, ఇబ్బందులు పట్టడం లేదు. డిప్యూటీ తహశీల్దార్‌కు చెబితే ఆయన కూడా అదనపు ధాన్యం ఇవ్వాల్సిందే అన్నారు...మురపాక సూర్యరాజా రైస్ మిల్లుకు 5,900 కేజీలు అప్పగించగా, 5,200కేజీలుగా నమోదు చేశారు. దీనిపై డిఎస్‌ఒకు ఫిర్యాదు చేస్తే ఆయన డిప్యూటీ తహశీల్దార్ వద్దకు పంపారు. ఆమె వచ్చి నాను న్యాయం చేయాల్సింది పోయి... అందరూ అలాగే ఇచ్చేస్తున్నారు... నువ్వు కూడా అలాగే ఇచ్చేయ్... ఎందుకొచ్చిన గోల అంటూ నన్నే వెనక్కితగించేందుకు ప్రయత్నించారు. కానీ, నేను మాత్రం అంగీకరించలేదు. కాబట్టి నా దగ్గర తీసుకున్న కేజీల మొత్తానికి బిల్లు ఇప్పించాలని అధికారులను కోరతున్నాను. ఈ మేరకు కలెక్టర్‌కు కూడా జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఫిర్యాదు చేశాను. ఆమె ఏమేరకు స్పందిస్తారో? చూడాలి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

మరొకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని మారేడుపల్లి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘట న చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపిన సమా చారం మేరకు పలమనేరు పట్టణం నుంచి రాజేష్, నారాయణ, లోకేష్ ఒకే ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తుం డగా బొలెరో వాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేష్ (47), నారాయణ (55) అక్కడికక్కడే మృతి చెందిగా లోకేష్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో గాయపడిన లోకేష్‌ను వైద్యం నిమిత్తం తిరుపతి స్విమ్స్ తరలించారు. అలాగే మృతులను పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతులు పలమనేరు పట్టణంలోని ఐడిబిసి బ్యాంకు సమీపంలో నివాసముంటున్నారు. పొట్టకూటి కోసం వెల్డింగ్ షాపును నిర్వహిస్తున్నారు. పని కోసం వెళుత్తుండా రోడ్డు ప్రమాదంలో మరణించారు. రాజేష్‌కు భార్య, కూతురు ఉన్నారు.

చెక్ పోస్టులు సమర్ధవంతంగా పనిచేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాల్లో గల చెక్ పోస్టులు సమర్ధవంతంగా పనిచేసేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం జిల్లా కలెక్టర్లతో పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు, ప్రాధాన్యతా భవనాలు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు రానున్న తరుణంలో వాటి పనితీరుపై దృష్టి సారించాలన్నారు. అక్రమ రవాణా జరిగే అంశాల పట్ల దృష్టి సారించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు గల పాఠశాలలకు ర్యాంపులు ఉండేలా చూడాలని, తాగునీరు, ఇతర సౌకర్యాల లభ్యతను పరిశీలించాలని ఆదేశించారు. పిఎం జన్‌మాన్ కార్యక్రమం కింద సర్వే త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 201 కేంద్రాల్లో సౌకర్యాలు ముఖ్యంగా ర్యాంపులు, మరుగుదొడ్లు అవసరమని గుర్తించామని, ఇప్పటికే వంద కేంద్రాల్లో పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన వాటిలో ఈ నెల 25 నాటికి పూర్తి చేస్తామని వివరించారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాలను వచ్చే పది రోజులలో గరిష్ఠంగా ప్రారంభించేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ, డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, హౌసింగ్ ఇన్ ఛార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రమేష్, డిఇఒ ఎన్. ప్రేమ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ ఎం ఎన్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

క్వాలిఫయర్‌తో జకోవిచ్ ఢీ

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ డ్రా విడుదల




మెల్‌బోర్న్: 2024 ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ డ్రా విడుదలైంది. టాప్‌సీడ్, సెర్బియాకు చెందిన జకోవిచ్ తొలిరౌండ్‌లో క్వాలిఫయర్‌తో తలపడనున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ నిర్వాహకులు గురువారం గ్రాండ్‌స్లామ్ టోర్నీ షెడ్యూల్‌ను డ్రా తీయగా.. రికార్డుస్థాయిలో 11వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన జకోవిచ్‌కు సునాయాస ప్రత్యర్థి ఎదురయ్యాడు. గత వారం అలెక్స్-డి-మినార్(ఆస్ట్రేలియా) చేతిలో జకోవిచ్‌కు తొలిసారి ఓటమి ఎదురైంది. మణికట్టు చికిత్స తర్వాత రాకెట్ పట్టిన జకోవిచ్‌కు తొలిసారి ఆస్ట్రేలియా ఆటగాని చేతిలో పరాభవం ఎదురైంది. 2023 వింబుల్డన్ ఛాంపియన్, 2వ సీడ్ కార్లోస్ అల్కరాజ్‌కు సునాయస ప్రత్యర్థి ఎదురుకాగా.. గత ఏడాది రన్నరప్ స్టెఫానాస్ సిట్సిపాస్‌కు క్లిష్టమైన డ్రా ఎదురైంది. అతడు మాటియో బెర్రెట్టినితో తలపడనున్నాడు. ఇక రెండుసార్లు ఫైనలిస్ట్ మెద్వదేవ్‌కు తొలిరౌండ్‌లో క్వాలిఫయర్‌తో ఆడనున్నాడు. జన్నిక్ సిన్నర్(ఇటలీ).. బోటిక్ వాన్-డి తో తొలిరౌండ్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇక మహిళల సింగిల్స్ టాప్‌సీడ్ ఇగా స్వైటెక్ తొలిరౌండ్‌లో కెనిన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సోఫియా కెనిన్ 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ కూడా. ఇక డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్యానా సబలెంక, 2023 రన్నరప్ ఎలైనా రైబకినా, కరోలినా ప్లిస్కోవాలకు తొలిరౌండ్‌లో సునాయాస ప్రత్యర్థులు ఎదురుకానున్నారు.

అడుగు దూరంలో సుమిత్..

భారత టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాలో చోటుకు అడుగు దూరంలో నిలిచాడు. గురువారం జరిగిన క్వాలిఫయి రౌండ్-2లో సుమిత్ 6-3, 6-2తో స్థానిక ఆటగాడు ఎడ్వర్డ్ వింటర్‌ను చిత్తుచేశాడు. శుక్రవారం జరిగే ఫైనల్ రౌండ్‌లో 26ఏళ సుమిత్.. మెల్కాన్(క్రొయేషియా)తో తలపడనున్నాడు. ఈ మ్యాచ్‌లో గెలిస్తే మూడేళ్ల తర్వాత మరో గ్రాండ్‌స్లామ్ టోర్నీకి అర్హత సాధించనున్నాడు. 139వ ర్యాంకర్ సుమిత్.. చివరిసారిగా 2021లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు అర్హత సాధించాడు. 2019, 20లో యుఎస్ ఓపెన్ మెయిన్ డ్రాకు చేరాడు.

ఆలయం సరే... విధ్వంసం మాటేమిటి?

- గూడు కోల్పోయి రోడ్డున పడ్డ అయోధ్య వాసులు
- మూతపడిన వ్యాపారాలు... దినదిన గండంగా బతుకులు
- ప్రజల పాలిట శాపంగా మారిన రోడ్ల విస్తరణ, సుందరీకరణ



లక్నో : ఆధునిక పౌరాణిక కథతో ఓ భారీ బాలీవుడ్ చిత్రాన్ని నిర్మిస్తే అందులోని సెట్టింగులు ఎలా ఉంటాయో తెలుసా? ఇప్పుడు అయోధ్యలో కూడా ఎక్కడ చూసినా అలాంటివే దర్శనమిస్తున్నాయి. రామ మందిర ప్రాణ ప్రతిష్టకు ముహూర్తం సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలో ఏ మూలన చూసినా బుల్డోజర్లు, ఎక్సవేటర్లు, డ్రిల్లింగ్ మిషన్లు రాత్రింబవళ్లు అవిశ్రాంతంగా పని చూసుకుంటూ పోతున్నాయి. వేలాది మంది కార్మికులు అలుపూ సొలుపూ లేకుండా సుందరీకరణ పనులకు తుది మెరుగులు దిద్దుతున్నారు. మూడు ప్రధాన రహదారులలో ఉన్న భవనాలకు రామ్‌పథ్, భక్తిపథ్, రామ జన్మభూమిపథ్ అని పేర్లు పెట్టి సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. 30 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన యానిమేషన్ లే-అవుట్ ఆనాటి అయోధ్య రాజ్యాన్ని గుర్తుకు తెస్తోంది. ఈ నెల 22న ప్రధాని నరేంద్ర మోడీ రామ మందిరాన్ని ప్రారంభించి, రాబోయే లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సమర శంఖం పూరించబోతున్నారు.

వాస్తవానికి ప్రధాన ఆలయ నిర్మాణం 2025 నాటికి కానీ పూర్తి కాదు. ఐదు సంవత్సరాల బాల రాముడి నూతన విగ్రహ ప్రతిష్టాపన కోసం అక్కడ ఇప్పుడు ప్రాణ ప్రతిష్ట జరుగుతోంది. అయినప్పటికీ ఇప్పుడు అక్కడ అంతా హడావిడే. అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మిస్తామని బీజేపీ ఇచ్చిన హామీ నెరవేరిందన్న ఉత్సాహంతో వేలాది మంది భక్తులు అయోధ్యకు తరలి వస్తున్నారు. రామ జన్మభూమి సమీపంలో నివసిస్తున్న ప్రజలు గత ఏడు దశాబ్దాలుగా జరుగుతున్న ఈ తతంగాన్ని, రాజకీయాలను చూస్తూనే ఉన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి వారికి పెద్దగా ఆనందం కలిగించడం లేదు. పైగా అది వారి పాలిట శాపంగా మారింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి పేరుతో రహదారుల విస్తరణ, సుందరీకరణ పనుల కోసం తమ నివాస గృహాలను నేలమట్టం చేయడం, జీవనోపాధిని దెబ్బతీయడం వారిని కుంగదీస్తోంది.

నామమాత్రపు నష్టపరిహారంతో సరి

నగరంలో జరిగిన అభివృద్ధిపై కొందరు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా ఓ కలగా ఉన్నదని అంటూనే జరిగిన విధ్వంసాన్ని కూడా కాదనలేమని చెప్పారు. నివాస గృహాలు కోల్పోయిన వారికి అధికారులు నామమాత్రంగా నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారు. ఇచ్చిన ఆ కొద్దిపాటి సొమ్ము ఇంటి పునర్నిర్మాణానికి ఏ మూలకు చాలలేదు. రోడ్ల విస్తరణ ప్రాజెక్టు కోసం చిన్న చిన్న దుకాణాలను తొలగించారు. దీంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. స్థానికుల ప్రయోజనాలు, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఓ ప్రణాళిక ప్రకారం పనులు చేసి ఉంటే బాగుండేదని, దానికి బదులు తమను వేధించి బెదిరించారని, ఇండ్లను కూల్చేసి చాలీచాలని సొమ్ము చేతిలో పెట్టారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యాటకుల కోసమేనా అభివృద్ధి?

2019కి ముందు అయోధ్య వ్యాపారులు ఎక్కువగా పరిసర ప్రాంతాల నుండి వచ్చే యాత్రికుల పైనే ఆధారపడే వారు. ముఖ్యమైన పండుగలు, ఆధ్యాత్మిక వేడుకలు వచ్చినప్పుడు మాత్రమే అయోధ్య భక్తులతో కళకళలాడుతుండేది. వారు పెట్టే ఖర్చు కూడా పరిమితంగానే ఉండేది. ఉచిత సత్రాలలో బస చేస్తూ, ప్రసాదాలతో కడుపు నింపుకునే వారు. 2019 తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సుప్రీంకోర్టు తీర్పుతో ఆలయ నిర్మాణానికి అవరోధాలు తొలగిపోవడంతో అయోధ్యలో మార్పులు కొట్టొచ్చినట్లు కన్పించాయి. భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం వేగవంతంగా వృద్ధి చెందింది. పెద్ద పెద్ద హోటళ్లు వెలిశాయి. యాత్రికుల రద్దీ పెరగడంతో వ్యాపారాలు ఊపందుకున్నాయి. రాబోయే కాలంలో రోజుకు మూడు లక్షల మంది పర్యాటకులు అయోధ్యకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ సంఖ్య నగర జనాభా కంటే ఎక్కువే. పర్యాటకుల అవసరాలు తీర్చేందుకు నగరంలో మౌలిక సదుపాయాలను వేగవంతంగా అభివృద్ధి చేస్తున్నారు. అయితే ఇదంతా పర్యాటకుల కోసమే. రోడ్ల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కారణంగా ఇళ్లు, జీవనోపాధి కోల్పోయిన స్థానికుల కోసం చర్యలు తీసుకుంటున్న దాఖలాలు మాత్రం కన్పించడం లేదు. ఆలయానికి సమీపంలో ఉన్న పూజా సామగ్రి దుకాణాలను తొలగించి కిలోమీటరు దూరంలో ఏర్పాటు చేసిన నూతన వాణిజ్య సముదాయానికి తరలించారు. అయితే అంతదూరం వచ్చి పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పైగా దుకాణాల లీజుకు లక్షల్లో రేటు నిర్ణయించారు. దీంతో కొందరు వ్యాపారాలు మూసేసుకోవాల్సి వచ్చింది.

రోడ్ల విస్తరణ, భారీ విగ్రహాలు, సుందరీకరణ...ఇవేవీ స్థానికులు కోరుకుంటున్నవి కావు. ఈ పనులన్నీ పర్యాటకులు, సందర్శకుల ప్రయోజనాల కోసం చేస్తున్నవే. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిని మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. నగరంలోని కొన్ని ప్రాంతాలకు నెలల తరబడి మంచినీటి సరఫరా జరగడం లేదు. నగరంలో నిపుణులైన వైద్యుల కొరత అధికంగా ఉంది. బైపాస్ వంటి శస్త్రచికిత్సల కోసం రాజధాని లక్నోకు వెళ్లాల్సి వస్తోంది.

భయం గుప్పెట్లో మైనారిటీలు

అయోధ్యలో నివసిస్తున్న ముస్లింలు క్షణమొక యుగంగా ప్రాణాలు అరచేత పట్టుకొని జీవిస్తున్నారు. వారిలో మసీదు కూల్చివేత మిగిల్చిన గాయాలు ఇప్పటికీ మానలేదు. 1992 నాటి భయానక ఘటనలు పునరావృతమవుతాయేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే రాబోయే రోజులలో హిందువులు లక్షలాదిగా అయోధ్యకు తరలివస్తారు. వారిలో ఎవరైనా మతోన్మాదులు ఉంటే పరిస్థితి ఏమిటి? ఊహించుకోవడానికే భయమేస్తోందని మైనారిటీలు తెలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం జరిగిన విధ్వంసకాండలో అనేక మంది ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. మైనారిటీల నివాస గృహాలు, ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఎలాగో కోలుకొని ఇండ్లను తిరిగి నిర్మించుకున్నామని, జీవితాలు గాడిలో పడ్డాయని అనుకుంటుంటే ఇప్పుడు మరోసారి నగర సుందరీకరణ పేరిట తమ ఆస్తులను ధ్వంసం చేశారని మైనారిటీలు వాపోయారు. పైగా అయోధ్యలో మైనారిటీల దుకాణాలు పరిమిత సంఖ్యలో ఉన్నాయి. వారి వ్యాపారాలు కూడా అంతంత మాత్రమే. ఉద్రిక్తతలను నివారించడానికి అనేక మంది ముస్లింలు హిందూ సమూహంతో రాజీ పడి జీవిస్తున్నారు. అయితే కొందరు హిందూ ఛాందసవాదులు మాత్రం మైనారిటీలే లక్ష్యంగా అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు ల్యాండ్ మాఫియా ఆగడాలు మితిమీరాయి. మైనారిటీల ఆస్తులను సొంతం చేసుకునేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోంది.

ఒకప్పుడు అయోధ్య అందరిదీ

చారిత్రకంగా చూస్తే అయోధ్య కేవలం హిందువులకే కాదు...ఇస్లాం, జైన, బౌద్ధ, సిక్కు మతాల ప్రాభవానికి కూడా అది కేంద్రంగా ఉంది. అక్కడ హిందూ దేవాలయాలతో పాటు మసీదులు, జైన దేవాలయాలు, గురుద్వారాలు, బౌద్ధ ప్రదేశాలు కూడా ఉన్నాయి. అయితే ఇప్పుడు అయోధ్య బహుళ సాంస్కృతిక వారసత్వాన్ని కోల్పోయింది. ఈ నగరం బహుళ జాతి సంస్థలకు డబ్బు సంపాదించడానికి, పార్టీలకు ఓట్లు రాల్చడానికి కేంద్రంగా మారింది.

ఇక ఈ నెల 22న అట్టహాసంగా జరుగుతున్న ఆలయ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో భాగస్వాములయ్యే అవకాశం స్థానికులకు మాత్రం లేదు. వారెవ్వరికీ ఆహ్వానాలు లేవు. 'నగరంలో రామ మందిరాన్ని నిర్మిస్తున్నారు. కానీ రాముడిపై స్థానికులకు ఉన్న హక్కును నిరాకరిస్తున్నారు. ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి నగర వాసులు హాజరు కావడం వారికి ఇష్టం లేదు. మమ్మల్ని ఇండ్లలోనే ఉండమని చెబుతున్నారు' అని స్థానికులు వాపోతున్నారు.

పుట్టబోయే బిడ్డ ఎవరో నిర్ణయించేది పురుష క్రోమోజోమ్‌లే !

- సమాజంలో దీనిపై అవగాహన పెరగాలి
- వరకట్న హత్య కేసు విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : పుట్టబోయే బిడ్డ ఆడ, మగా అని నిర్ణయించేది పురుషుడి క్రోమోజోమ్‌లే తప్ప మహిళవి కావన్న విషయంపై సమాజంలో అవగాహన, చైతన్యం తీసుకురావాల్సిన అవసరం వుందని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. తమ ఇంటికి వచ్చిన కోడలు తమ వంశ వృక్షాన్ని నిలపాలనే భావించే అత్తమామలు అందుకు మూల కారణం తమ కొడుకే తప్ప కోడలు కాదన్న విషయం తెలుసుకోవాల్సి వుందని పేర్కొంది. ఒక మహిళ వరకట్న మృతి కేసు విచారణ సందర్భంగా హైకోర్టు పై వ్యాఖ్యలు చేసింది. తగిన కట్నం తీసుకురాకుండా ఇద్దరు కుమార్తెలకు జన్మనిచ్చిందన్న కారణంతో భర్త, అత్తమామలు పెట్టిన వేధింపులతో ఆ బాధితురాలు చనిపోయింది. నేటి సమకాలీన సమాజంలో మహిళ విలువను భౌతిక పరిగణనలతో ముడిపెట్టాలనే ఆలోచన సమానత్వం, గౌరవం వంటి సూత్రాలకు పూర్తి విరుద్ధంగా వుందని కోర్టు పేర్కొంది.

తిరోగమన దృక్పథంతో కూడిన మనస్తత్వాలు, వరకట్నం కోసం పట్టుబట్టి, ఎంతకైనా తెగించే సంఘటనలు చూస్తుంటే విశాల దృక్పథంతో కూడిన సామాజిక ఆందోళన అవసరాన్ని నొక్కి చెబుతోంది. వివాహితలు ఎదుర్కొంటున్న సవాళ్ళ ఈ విషయాన్ని ప్రముఖంగా చెబుతున్నాయి. మహిళల విలువ, వారి గౌరవమనేది ధన దాహంతో అత్తమామలు చేసే కట్నం డిమాండ్లను నెరవేర్చలేని తల్లిదండ్రుల సామర్థ్యాలపై ఆధారపడరాదని జస్టిస్ స్వర్ణ కాంత శర్మ పేర్కొన్నారు.

అత్తమామల ఇంట్లో అందరి ప్రేమ, మద్దతు తమ కూతురు పొందాలని తల్లిదండ్రులు ఆశిస్తారని, కానీ పెళ్ళికూతురు అంతులేని ఆశ, అరాచకంతో అత్తమామల కుటుంబం పెట్టే ఆరళ్ళను, వేధింపులను ఎదుర్కొంటుడడం ఆందోళన కలిగిస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ వరకట్న వేదింపులకు తోడు, ఆడపిల్లలకు జన్మనివ్వడం వేధింపులకు మరో కారణమవుతోందని పేర్కొంది. ఆడపిల్ల పుట్టడం కేవలం కోడలి తప్పే అన్నట్లు ఆమెను పూర్తిగా బాధ్యురాలిని చేస్తున్నారని, ఇందుకు సంబంధించి జన్య శాస్త్రం చెప్పే వాస్తవాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొంది. పురుషుడిలో ఎక్స్, వై క్రోమోజోమ్‌లు వుంటాయి, మహిళల్లో రెండు ఎక్స్ క్రోమోజోమ్‌లు వుంటాయి, పురుషుడి వీర్యం తీసుకువచ్చే క్రోమోజోమ్‌ను బట్టి పుట్టేది ఆడపిల్లా, మగపిల్లవాడా అనేది నిర్ణయించబడుతుందని, ప్రజల్లో ఈ మేరకు అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా వుందని హైకోర్టు పేర్కొంది. ఈనాటి ఈ తీర్పుతోనైనా అటువంటి చైతన్యం మొదలైతే ప్రజల మనస్తత్వాల్లో మార్పు రావడానికి చాలా కాలం పడుతుందని జస్టిస్ స్వర్ణ కాంత శర్మ పేర్కొన్నారు. ఈ వరకట్న కేసుల్లో భర్తకు బెయిల్ ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది.



మెహబూబా ముఫ్తీకి తృటిలో తప్పిన ప్రమాదం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) చీఫ్ మెహబూబా ముఫ్తీ గురువారం ఒక కారు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. దక్షిణ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో జరిగిన ప్రమాదం నుంచి ముఫ్తీ తృటిలో తప్పించుకున్నారని పార్టీ ప్రతినిధి తెలిపారు. ప్రమాదానికి గురైన కారు నుంచి ముఫ్తీ, ఆమె భద్రతా సిబ్బంది ఎటువంటి తీవ్రమైన గాయాలు లేకుండా బయటపడ్డారని తెలిపారు.

ఫరూక్ అబ్దుల్లాకు ఇడి నోటీసులు

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాకు నోటీసులు జారీ అయ్యాయి. ఆయనను విచారించేందుకు ఇడి సమన్లు పంపింది. జమ్మూ అండ్ కాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జెకెసిఎ)లో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఇడి గతంలోనూ ఆయనను విచారించింది. ఈ కేసులో ఇడి 2022లో అభియోగాలు మోపింది. కాగా, ఫరూక్ అబ్దుల్లా ప్రస్తుతం శ్రీనగర్ ఎంపీగా ఉన్నారు.

జమిలిని అంగీకరించం : మమత బెనర్జీ

న్యూఢిల్లీ : 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' విధానాన్ని తాము అంగీకరించబోమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ గురువారం తెలిపారు. జమిలీ ఎన్నికల అంశంపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీకి ఈ మేరకు ఆమె లేఖ పంపారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' అనే భావనను తాము అంగీకరించలేకపోతున్నామని ఆమె తెలిపారు. 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించినా, తరువాత నుంచి అలా జరగడం లేదని ఆమె గుర్తు చేశారు.

ఉత్తర భారత్‌లో ప్రకంపనలు

న్యూఢిల్లీ : ఆఫ్ఘనిస్థాన్‌లో గురువారం మధ్యాహ్నం 6.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో ఉత్తర భారత్‌లోని అనేక ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. భారత కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 2:50 గంటల సమయంలో దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)- న్యూఢిల్లీ, నోయిడా, ఫరిదాబాద్, గురుగ్రామ్, గజియాబాద్, ఛండీగఢ్, జమ్ముకాశ్మీర్, హర్యానా, పంజాబ్ సహా ఈశాన్య భారత్‌లోని పలుచోట్ల భూ ప్రకంపనలు చోటుచేసుకోవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌కు ఈశాన్యంగా 241 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు.

గణతంత్ర వేడుకల్లో 16 శకటాలే !

- పలు రాష్ట్రాలకు లభించని ప్రాతినిధ్యం
- వివక్ష చూపారని కేంద్రంపై కర్ణాటక, పంజాబ్ ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించి ఈ ఏడాది 16 శకటాలకు మాత్రమే అవకాశం దక్కింది. కొన్ని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం కావాలనే శకటాల ప్రదర్శనకు అవకాశం కల్పించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శకటాల ప్రదర్శన జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు చోటు దక్కించుకున్నాయి. అయితే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య (కాంగ్రెస్), పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ (ఆమ్ ఆద్మీ పార్టీ)తో సహా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల శకటాలను తిరస్కరించడంపై విమర్శలు గుప్పించారు. వివక్ష తగదంటూ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు రిపబ్లిక్ డే పరేడ్‌లో శకటాల ప్రదర్శించడానికి సమాన అవకాశం ఇచ్చామని వివరణ ఇచ్చింది. రక్షణ మంత్రిత్వశాఖ, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఒయు) ప్రకారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కర్తవ్య పథ్‌లో రాబోయే మూడు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తమ శకటాలను ప్రదర్శించడానికి సమాన అవకాశాన్ని పొందాయని ప్రభుత్వ సీనియర్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది కర్తవ్య పథ్‌లో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో త్రివిధ రక్షణ శాఖలు, ఇతర యూనిఫాం దళాల కవాతులో 75 శాతం మంది మహిళలు పాల్గొంటారని అధికారులు తెలిపారు. జనవరి 26న రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు శకటాలను ప్రదర్శించడానికి ఎంపిక చేశామన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, లడఖ్, అరుణాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, ఒడిశా రాష్ట్రాలు ఈ సంవత్సరం తమ శకటాలను ప్రదర్శిస్తాయి. జమ్మూ కాశ్మీర్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, త్రిపుర, గోవా, అస్సాం, ఉత్తరాఖండ్ జనవరి 23 నుంచి 31 వరకు ఎర్రకోటలో భారత్ పర్వ్‌లో పాల్గొంటాయి. ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ అండ్ ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ సిఫార్సు చేసిన ప్రఖ్యాత కళాకారులతో కూడిన నిపుణుల కమిటీని టాబ్లాక్స్ ఎంపిక కోసం ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

బహిరంగ ఎంపిక ప్రక్రియతో టేబుల్ యాక్స్ రూపకల్పన కోసం 30 ఏజెన్సీలు ఉన్నాయని, సైన్యంలో మహిళా సిబ్బంది తక్కువగానే ఉన్నప్పటికీ, గణతంత్ర దినోత్సవ కవాతులో 75 శాతం వరకు పాల్గొంటున్నారని తెలిపారు.

విజయ రాఘవన్ కమిటీ సిఫార్సులను వ్యతిరేకించండి

- రక్షణ మంత్రికి సిఐటియు లేఖ

న్యూఢిల్లీ : రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ)పై ఏర్పాటు చేసిన కె.విజయ రాఘవన్ కమిటీ సిఫార్సులను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కమిటీని ఏర్పాటు చేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు గురువారం లేఖ రాస్తూ, కమిటీ ఇచ్చిన నివేదికను తిరస్కరించాల్సిందిగా కోరింది. ఆ సిఫార్సులను అమలు చేయవద్దని సూచించింది. ఈ సిఫార్సులను అమలు చేసినట్లైతే ప్రధానంగా ప్రభుత్వ సంస్థగా వున్న డిఆర్‌డిఓని ప్రైవేటీకరించడానికి దారి తీస్తుందని ఆ లేఖ పేర్కొంది. దేశీయంగా యుద్ధ సామాగ్రి, పరికరాలను వృద్ధిపరచడం ద్వారా జాతీయ భద్రతకు ఇతోధికంగా దోహదపడిందని, తద్వారా రక్షణ రంగ ఉత్పత్తిలో స్వావలంబనకు డిఆర్‌డిఓ వెసులుబాటు కల్పించిందని పేర్కొంది. ఈ సిఫార్సులు అమలు చేస్తే, డిఆర్‌డిఓ భవితవ్యం, అవకాశాలు దెబ్బతింటాయని, 30 వేల మందికి పైగా సిబ్బందిని, అందులో 30 శాతం మంది శాస్త్రవేత్తలను కలిగి వున్న దాదాపు 50 ల్యాబ్‌లు, సంస్థలు పణంగా పెట్టబడతాయని ఆ లేఖ పేర్కొంది. ఇది, ప్రతిష్టాత్మమైన, సవరించిన బడ్జెట్ కేటాయింపులు రూ.23264 కోట్లుకు, విదేశీ, దేశీయ ప్రైవేటు కార్పొరేట్లకు రూ.35 వేల ఎగుమతుల లక్ష్యాలకు తిలోదకాలు ఇవ్వడమేనని, జాతీయ ప్రయోజనాలపై రాజీ పడడమేనని విమర్శించింది.



ప్రజా ప్రణాళికలతో కేరళ అభివృద్ధి బాట

- 'కర్షక తుల్లాలి' సభలో బి వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజల అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం కేరళ వామపక్ష ప్రభుత్వం పనిచేస్తుంటే, దేశంలో మతోన్మాదం పెంచి, కార్పొరేట్ వర్గాలకు ఉపయోగపడేలా దేశాన్ని అస్థిర పరిచేలా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పని చేస్తున్నారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుఎ) జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు రోజువారీ వేతనంగా రూ.800-900 ఇచ్చి వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ కార్మికులకు, రైతులకు, ఇతర పనుల వారికి ఉపయోగపడేలా '(కర్షక తుల్లాలి)' వ్యవసాయకార్మిక, కర్షక సేన'ను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేక యూనిఫాంతో ఈ సేన ఉంటుందన్నారు. లక్షలాది మంది సభ్యులుగా ఉన్నారని అన్నారు. కేరళలోని పాల్కాడ్‌లో కార్మిక, కర్షక సేన సభకు గురువారం ముఖ్య అతిథిగా హాజరైన బి వెంకట్ మాట్లాడుతూ.. గతంలో గ్రామీణాభివృద్ధి కోసం సహకార వ్యవస్థను ఏర్పాటుచేసిన కేరళ ప్రభుత్వం, ఇప్పుడు వ్యవసాయ కార్మికుల కోసం, వారి వేతనాలు కోసం కార్మికులు, కర్షకులు మధ్య వారధిగా నిలిచేందుకు (కర్షక తుల్లాలి) వ్యవసాయ కార్మిక, కర్షక సేన ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం కేరళ కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి నెలంతా తమ ప్రభుత్వాన్ని తాము కాపాడుకుంటామంటూ క్షేత్రస్థాయిలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రతి కుటుంబాన్నీ కలిసి వామపక్ష ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని నిర్ణయించిందన్నారు. కార్మిక, కర్షక మైత్రితో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం జరుగుతోందన్నారు.

ఇజ్రాయిల్ మారణకాండపై ఐసిజెలో విచారణ



ది హేగ్ : పాలస్తీనియన్లను సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ఇజ్రాయిల్ మారణకాండకు పాల్పడుతోందని దక్షిణాఫ్రికా విమర్శించింది. అంతర్జాతీయ న్యాయ స్థానంలో ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంపై జరుగుతున్న విచారణ సందర్భంగా దక్షిణాఫ్రికా తన వాదనలు వినిపించింది. తక్షణమే గాజాపై ఇజ్రాయిల్ వైమానిక, పదాతి దాడులను అత్యవసరంగా ఆపేయాలని దక్షిణాఫ్రికాలో హైకోర్టు న్యాయవాది టెంబెకా ఎంగ్‌కుకైతొబి డిమాండ్ చేశారు. గాజాలో ప్రజానీకాన్ని పూర్తిగా నిర్మూలించడమే ఈ దాడుల ఉద్దేశ్యమన్నారు. హమాస్ కోసం డెవిల్ అడ్వకేట్‌గా దక్షిణాఫ్రికా వ్యవహరిస్తోందంటూ ఇజ్రాయిల్ ఆరోపించింది.

ఒక జాతి లేదా మత సమూహం మొత్తంగా లేక కొంత భాగాన్ని నాశనం చేయాలనే ఉద్దేశ్యంలో పాల్పడే చర్యలను ఊచకోత లేదా మరణహోమంగా 1948 నాటి ఒప్పందం నిర్వచిస్తోంది. అతి చిన్నదైన, జనసాంద్రతతో కూడిన గాజాలో ఇప్పటివరకు 23 వేల మందికి పైగా ప్రజలను ఇజ్రాయిల్ తన దాడుల్లో హతమార్చిందని, ప్రతి రోజూ ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తోందని దక్షిణాఫ్రికా పేర్కొంది. ఆహారం, నీరు, విద్యుత్, ఔషధాలు, ఇతర నిత్యావసరాలు గాజాకు అందించడంలో ఇజ్రాయిల్ విఫలమైందని తన పిటిషన్‌లో దక్షిణాఫ్రికా పేర్కొంది. ప్రపంచ న్యాయస్థానంలో జరుగుతున్న కార్యకలాపాలను ఆసక్తిగా చూస్తున్నట్లు హమాస్ అధికారి సామి అబూ జుహ్రి చెప్పారు. నేడు న్యాయం పరీక్షించబడనుందని ఆయన వ్యాఖ్యానించారు. అన్ని ఒత్తిళ్లను కాదని, ఇజ్రాయిల్ చర్యలను నేరపూరితం చేస్తూ నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరారు. శుక్రవారం ఇజ్రాయిల్ తన వాదనలను వినిపించనుంది. మొత్తం విచారణ పూర్తయిన తర్వాత ఈ నెలాఖరులో అత్యవసర చర్యలను తీసుకునే అవకాశం వుందని భావిస్తున్నారు. మారణకాండ ఆరోపణలపై ఆ సమయంలో రూలింగ్ ఇవ్వదు, ఈ ప్రొసీడింగ్స్ పూర్తవడానికి ఏళ్ళు పట్టే అవకాశం వుంది. ఐసిజె నిర్ణయాలు తుదివి, వాటిపై అప్పీల్ చేయడానికి లేదు. కానీ, వాటిని అమలు చేసే అధికారం కోర్టుకు లేదు. ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న ఈ కేసులో ఇరు పక్షాల మద్దతుదారులు హేగ్‌లో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాలని భావిస్తున్నారు. గురువారం ఉదయమే పాలస్తీనా అనుకూల ప్రదర్శన జరిగింది.

నిరాధార ఆరోపణలు : ఇజ్రాయిల్

కాగా తమపై చేస్తున్న ఆరోపణలను నిరాధారమైనవని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. గాజాను శాశ్వతంగా ఆక్రమించాలన్న ఉద్దేశ్యం ఇజ్రాయిల్‌కు లేదని ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. గాజా నుండి మొత్తంగా ప్రజలను నిర్వాసితులను చేయాలని కూడా తాము భావించడం లేదని ఆయన తెలిపారు.



బ్రిటన్‌లో ముగిసిన రాజ్‌నాథ్ పర్యటన

- చివరి రోజు రిషి సునాక్‌తో భేటీ

లండన్ : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రెండు రోజుల ఇంగ్లండ్ పర్యటన గురువారం ముగిసింది. చివరి రోజు ఆయన బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ సమావేశమయ్యారు. అలాగే ప్రవాస భారతీయులు నిర్వహించిన ప్రత్యేక కార్యాక్రమాల్లోనూ రాజ్‌నాథ్ పాల్గొన్నారు. సునాక్‌తో భేటీ 'ఆశాజనక వాతావరణం'లో జరిగిందని మంత్రి తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ కామెరూన్‌తోనూ రాజ్‌నాథ్ భేటీ అయ్యారు.

పార్టీకి మీరే కళ్లు, చెవులు

- కో-ఆర్డినేటర్ల సమావేశంలో ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ నియమించిన లోక్‌సభ స్థానాల కో-ఆర్డినేటర్లే అధిష్టానానికి కళ్లు, చెవులని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు దగ్గరవడంతోపాటు, దక్షిణాది రాష్ట్రాల్లో మెజార్టీ సీట్లు గెలిచేలా పని చేయాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికలకు సమయాత్తంలో భాగంగా గురువారం ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో తొలుత తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, లక్షద్వీప్ రాష్ట్రాలకు సంబంధించిన లోక్‌సభ నియోజకవర్గాల కాంగ్రెస్ కో-ఆర్డినేటర్లతో మల్లికార్జున ఖర్గే కీలక భేటీ నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గోవా, అండమాన్ నికోబార్ దీవుల లోక్‌సభ నియోజకవర్గాల కాంగ్రెస్ కో-ఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఈ భేటీలో ఎపి నుంచి తులసిరెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, తెలంగాణ నుంచి డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ముఖ్య నేతలు జీవన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

షర్మిల రాకతో ఉత్సాహం : తులసిరెడ్డి

ఎపి, ఒడిశాలో అత్యధిక స్థానాలు గెలిచేందుకు ప్రణాళిక ఇచ్చారని తులసిరెడ్డి తెలిపారు. ఎపిలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుందని చెప్పామని అన్నారు. కర్ణాటక ఎన్నికల తరువాత ఎపిలో కాంగ్రెస్‌కు ఊపు వచ్చిందని, షర్మిల చేరిక తరువాత మరింత పెరిగిందని అన్నారు. కాగా తెలంగాణ నుంచి సోనియా గాంధీ పోటీ చేసేలా చూడాలని అధిష్టానాన్ని అభ్యర్థించినట్లు తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి వెల్లడించారు.

నేడు విద్యార్థి సంఘాల చలో పార్లమెంటు

- విద్యా వినాశకర విధానాలపై ఐక్యపోరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


విద్యారంగంలో మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధ్వంసకర చర్యలకు వ్యతిరేకంగా శుక్రవారం ఎస్ఎఫ్ఐతో సహా 16 విద్యార్థి సంఘాలు చలో పార్లమెంటు నిర్వహించనున్నాయి. జంతర్ మంతర్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించనున్నాయి. ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థి నేతలు, కార్యకర్తలు దేశ రాజధానికి చేరుకున్నారు. మోడీ సర్కార్ విద్యా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలని దేశంలోని అన్ని ప్రధాన విద్యార్థి సంస్థల ఉమ్మడి వేదిక 'యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా' నిర్ణయించింది. 'సేవ్ ఎడ్యుకేషన్, రిజెక్ట్ ఎన్ఇపి, సేవ్ ఇండియా, రిజెక్ట్ బిజెపి' అనే నినాదంతో దేశవ్యాప్తంగా విద్యార్థులను ఈ ఉద్యమం చైతన్యవంతం చేస్తుంది. ఉద్యమంలో భాగంగా రాజధాని ఢిల్లీలో విద్యార్థుల భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిస్వాస్ తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఆందోళనలో దేశంలోని అన్ని ప్రధాన విద్యార్థి సంఘాల జాతీయ నాయకత్వం హాజరవుతుందన్నారు.

దేశంలో 32 చోట్ల ఎన్ఐఎ దాడులు



న్యూఢిల్లీ : దేశంలో తీవ్రవాదులు- గ్యాంగ్‌స్టర్లు- మాదకద్రవ్యాల స్మగ్లర్ల మధ్య సంబంధాలను విచ్ఛిన్నం చేసే దిశగా చేపట్టిన చర్యల్లో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) గురువారం 32చోట్ల సోదాలు నిర్వహించింది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్‌ల్లో ఈ దాడులు జరిగినట్లు అధికారులు చెప్పారు. ఆయా రాష్ట్రాల పోలీసు బలగాల సమన్వయంతో గురువారం ఉదయమే ఈ దాడులు ప్రారంభమయ్యాయి. తీవ్రవాద నిరోధక సంస్థకు చెందిన పలు బృందాలు ఈ దాడుల్లో పాల్గొంటున్నాయి. కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కి చెందిన తీవ్రవాదం-నేరాల సిండికేట్‌కు చెందిన సభ్యుల నివాసాలపై అధికారులు సోదాలు జరిపారు. లారెన్స్ బిష్ణోయ్‌కి చెందిన ఆరు ఆస్తులను ఈ నెల 6న ఎన్ఐఎ జప్తు చేసింది. అనంతరం ఈ దాడులు నిర్వహిస్తున్నారు. అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టం కింద హర్యానా, పంజాబ్, యుపిల్లో సమన్వయంతో చేపట్టిన కార్యకలాపాల్లో మూడు స్థిరాస్తులు, ఒక చరాస్థిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తులన్నీ కూడా తీవ్రవాద నేరాల ద్వారా వచ్చిన లాభాలేనని ఎన్ఐఎ పేర్కొంది. లారెన్స్ బిష్ణోయ్‌కి సన్నిహిత సహచరుడైన గ్యాంగ్‌స్టర్ కాలా రాణా తండ్రి జోగిందర్ సింగ్‌కి చెందిన ఫార్చ్యూనర్ కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. తీవ్రవాద చర్యలకు అవసరమైన ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని రవాణా చేసేందుకు, తీవ్రవాదులకు ఆశ్రయం కల్పించేందుకు జోగిందర్ సింగ్ ఈ కారును వాడాడని అధికారులు పేర్కొన్నారు. సంచలనం రేకెత్తించిన అనేక నేరాల్లో ఈ నెట్‌వర్క్‌లు పనిచేశాయి. పంజాబీ గాయకుడు సిధూ మూసేవాలా హత్యతో సహా పలు నేరాలకు పాల్పడ్డాయి.

బద్ధకస్తుడు



రంగడు పెద్ద సోమరి. ఏ పనీ చేయకుండా ఎక్కడ విందు భోజనం ఉంటే అక్కడికి వెళ్లి తినేవాడు. ఒక రోజు గ్రామంలో రంగడికి తిండి దొరకలేదు. పని చేయకుండా ఊరికే పెట్టడానికి ఎవరూ ముందుకురాలేదు. దీంతో పొరుగూరు వెళితే అక్కడ పంచభక్ష్య పరమాన్నాలు దొరుకుతాయని ఆశించి బయలుదేరాడు. దారిలో అతనికి ఒక పొలం పక్కన జామ చెట్టు కనపడింది. చెట్టు నిండా పళ్లున్నాయి. వాటిని చూడగానే రంగడికి ఆకలి వేసింది. పొలంలో పని చేసుకుంటున్న రైతు దగ్గరకు వెళ్లి జామపండ్లు కోసుకుంటానని అడిగాడు. రైతు సరేనని ఒప్పుకోవడంతో ఆ పండ్లని తిన్నాడు. అయితే గ్రామంలో జరిగిన అవమానం గుర్తుకొచ్చి, అక్కడి నుండి వెళ్లేటప్పుడు రైతుకు ఏదైనా సాయం చేయాలని అనుకున్నాడు. అదే విషయం రైతును అడిగాడు. బావిలో నీరు తోడి మొక్కలకు పోయమని రైతు చెప్పాడు. అయితే ఆ పని చేతకాని రంగడు బావిలో చేద వేసి తీయలేక దాన్ని అందులోనే వదిలేశాడు. అది చూసిన రైతు లబోదిబోమంటూ బావి దగ్గరకు పరుగెత్తుకు వచ్చాడు. 'బాబూ నువ్వు ఏ పనీ చేయక్కర్లేదు. ముందు ఇక్కడి నుండి వెళ్లిపో' అని కసురుకున్నాడు. 'నన్ను క్షమించండి బాబు, ఇంకేదైనా పని ఉంటే చెప్పండి. మీరు ఎండలో ఇంత కష్టపడి పని చేస్తుంటే నాకు ఊరికే వెళ్లాలనిపించడం లేదు' అంటూ బతిమాలాడాడు. రైతు మెత్తబడి 'సరే, ఇదిగో గునపం. దీంతో అక్కడ మట్టిని తవ్వి గుంతలు తీయి' అని మరో పని పురామాయించాడు. పని ప్రారంభించిన కాసేపటికే చేతులు బొబ్బలెక్కి మధ్యలోనే వదిలేశాడు. రోజూ పనీపాట లేకుండా కూర్చొని ఉండడం వల్ల ఏ పనీ చేయలేకపోతున్నానని తనని క్షమించమని అడిగి అక్కడి నుండి బయల్దేరాడు.

కొంచెం దూరం వెళ్లేసరికి దూరం నుండి ఓ గుంపు, ఓ కుక్క ఒక వ్యక్తిని వెంబడించడం రంగడికి కనిపించింది. అతని చేతిలో ఓ మూట ఉంది. ఆ గుంపు 'దొంగ దొంగ' అని అరుస్తూ రావడం విన్న రంగడు, తన దగ్గరగా వచ్చిన ఆ దొంగను గట్టిగా పట్టుకున్నాడు. జనాలు దగ్గరకు రావడంతో భయపడిపోయిన దొంగ ఆ మూటను అక్కడే వదిలేసి పరుగులంకించుకున్నాడు.

ఆ మూట ఆ ఊరి జమీందారిది. అందులో నగలు, డబ్బులు ఉన్నాయి. దొంగ నుండి నగలు కాపాడినందుకు జమీందారు రంగడిని ఎంతో మెచ్చుకున్నాడు. కొంత సొమ్ము ఇచ్చి రంగడికి కృతజ్ఞతలు చెప్పాడు. కానీ రైతు పొలంలో జరిగిన అవమానం గుర్తుచేసుకున్న రంగడు, తనకు డబ్బులు వద్దని, ఏదైనా పని ఉంటే చెప్పమని అడిగాడు. అయితే ఏ పనీ చేతకాదని తలదించుకున్నాడు. రంగడి గురించి వాకబు చేసిన జమీందారు అతనిలో వచ్చిన మార్పును గ్రహించి, తన కొలువులోనే ఓ చిన్న పనికి పురమాయించాడు. చాలా త్వరగానే రంగడు పని నేర్చుకున్నాడు. జీతం డబ్బులతో కోరింది తినేవాడు. ఈ పరిణామం రంగడికి ఎంతో సంతృప్తినిచ్చింది.

సోమరిపోతులా కూర్చోకుండా కష్టపడి పనిచేస్తే గౌరవంతో పాటు కడుపునిండా భోజనం కూడా దొరుకుతుందని గ్రహించాడు. ఆనాటి నుండి బద్ధకాన్ని వదిలి జమీందారు కొలువులోనే అంచెలంచెలుగా ఎదిగాడు.



చిత్రం, కథ : ఇత్తంశెట్టి దేదీప్య సత్యసాయి దుర్గ,
7వ తరగతి,
శ్రీ తిమ్మరాజు ఉన్నత పాఠశాల,
తణుకు తంగిరాలు వారి వీధి, వెంకటరాయపురం, పశ్చిమగోదావరి జిల్లా.

నేను గీసిన బొమ్మ





శ్రేష్ఠ,
5వ తరగతి,
యూరో స్కూల్,
పూణే.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

---

ఎటుచూసినా పచ్చటి పైర్లు..చెట్లూ చేమలు.. ఆహ్లాదాన్ని పెంపొందించే కొండలు, కోనలు... జలపాతాలు.. సంప్రదాయాలతో ముడిపడిన సంస్కృతీ వారసత్వం. ఇదీ కర్నాటక కొడవాలు నివసించే ప్రాంతాల్లో ప్రజల జీవన విధానం. ఏటేటా పంటలు చేతికి వచ్చే సమయంలో ఇక్కడి ప్రజానీకం కైల్పోద్, పుత్తరి పండుగలను వైభవోపేతంగా నిర్వహిస్తుంటారు.



కనువిందుగా 'పుత్తరి' ఉత్సవం

కాలం మారినా..జీవన శైలిలో మార్పులొచ్చినా నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో పండుగలను సమిష్టితత్వంతో జరుపుకుంటారు. ఇలాంటిదే కర్నాటకలో కొడగు జిల్లాలో కొడగు తెగకు చెందిన కొడవాలు (నిప్పులు కురిపించేవారు, నైపుణ్యం గల వ్యక్తుల సమూహం)గా పిలుస్తుంటారు. యోధుల తెగగా కూడా ఇతర ప్రాంతాల వారు పిలుస్తుంటారు. వీరు తమ పూర్వీకుల ఆయుధాలను భావి తరాలకు భద్రపర్చి అందజేయటం ఆనవాయితీ. యువతరాలకు యుద్ధకళ నేర్పటంతోపాటుగా ఆయా సంప్రదాయాల సజీవంగా అందజేయటానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. నిరంతరం ప్రకృతిలో మమేకమై జీవించే ఈ ప్రజానీకం అటవీ ఉత్పత్తులు, పొలాల నుంచి వచ్చే పంటలను తమ జీవనంలో భాగం చేసుకుంటుంటారు. సహజ ప్రకృతి సౌందర్యంతో నిత్యం పొగమంచుతో కూడిన గంభీరమైన పర్వతశ్రేణులకు దగ్గరలో నివశించే ప్రజలే వీరు. అంతరించిపోతున్న ద్రావిడ భాషల్లోని కొడగు వీరి భాష. కొడగు భాష మాట్లాడే వారిలో మరో 14 తెగలకు చెందిన వారున్నారు. గిరిజన ప్రాంతాల మాదిరి స్వయం ప్రతిపత్తి పొందిన ప్రాంతాల్లో నివశించే ఈ కొడవాలు ప్రజానీకం జీవనం వైవిధ్యంగా ఉంటుంది. కల్లా కపటం లేని జీవనం, పరస్పరం సాయం చేసుకునే మనస్తత్వం, ఐక్యతాభావం అణువణువునా తొణికిసలాడేలా హాస్య సరస వరసలతో పల్లెలంతా ఒక్క కుటుంబంగా కనబడుతుంటాయి. చక్కని సహజ ధోరణిలో పల్లెపాటలు, మాటలు, సంప్రదాయాలు వీరి జీవనంలో ప్రస్ఫుటమవుతుంటాయి.

ఏటేటా పండుగ సందర్భంగా జానపద నృత్యాలు, క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. గతంలో జంతువుల వేటను క్రీడగా పెద్దలు భావించేవారు. తరాల్లో మార్పులు రావటంతో ఇప్పుడు షూటింగ్ స్కిల్స్, ఫిజికల్ స్పోర్ట్స్ మొదలైన వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వేడుకలన్నీ గ్రామాల్లోని మందిరాలు (ముండ్)' లేదా బహిరంగ మైదానాల్లో వైభవపేతంగా జరుపుతుంటారు.



హ్యాపీ కైల్పోద్ జరిగేదిలా..

కైల్ అంటే ఆయుధం, పోద్ అంటే పండుగ. కైల్పోద్ పండుగను ఆయుధాల పండుగగా చేసుకుంటారు. పంట పొలాలు దున్నటం, విత్తడం, వరినాట్లు వేయటం వంటి వ్యవసాయ పనుల్లో కష్టపడిన వారంతా దానిని మర్చిపోవటానికి ఆనందంగా ఈ పండుగను జరుపుకుంటారు. ఏటేటా సెప్టెంబర్ 3న దీనిని జరుపుకుంటారు. సూర్యుడు సింహరాశిలోకి ప్రవేశించిన 18వ రోజున ఇది ప్రారంభమవుతుంది. పండుగ అంతా పంటల మార్పిడి పూర్తికావటం, దాని వెనుక ఉన్న కృషిని అనుసరించే వేడుక. కదంబుట్టు, వోటి, పాపుట్ సాదా కేకులు, సూపుట్ నూడుల్స్ లాంటి ఉడికించిన పిండి బంతులు, పాండి (పందిమాంసం), కోలి (చికెన్), యెర్చి (మటన్)కూర, డెజర్ట్‌లు వంటి మాంసం వంటకాలతోపాటుగా అక్కి పాయస (అన్నం ఖీర్) వంటివి కూడా ప్రతి ఇంటా వండుకుని ఆరగిస్తుంటారు. పూర్వీకుల సమ్మేళనాల్లో వారి ఫొటోలకు పూజలు చేస్తుంటారు.

ప్రత్యేక దుస్తులతో ఆకట్టుకునేతత్వం

తెల్లవారుజామునే కొడవాలు గ్రీకు సైన్యం (టోగా) మాదిరి దుస్తులతో అడవిపందులను వేటాడేందుకు లోడ్‌చేసిన రైఫిళ్ల(తుపాకి)తో వెళ్తారు. జంతువులను వేటాడి తెచ్చి వంటలు చేస్తారు. వివాహ వేడుకల్లోనూ, ఇతర శుభకార్యాల్లోనూ మద్యపానం, రుచికరమైన ఆహారంతో కూడిన భోజనాలుంటాయి. బృంద నృత్యాలు, వీనుల విందైన వాయిద్యాలు, అందరూ ఉమ్మడి నృత్యాలు, విచిత్రమైన హావభావాలతో సంగీత కచేరీలు హోరెత్తుతాయి. చిన్నా-పెద్దా అనే తేడా లేకుండా స్త్రీలు, పురుషులు ఆయా జానపదాల్లో లీనమై సంగీతానికి అనుగుణమైన డ్యాన్సులు, నృత్యాలతో జత కలుస్తుంటారు.

కొత్త పంటల పండుగే 'పుత్తరి'

కొడవాలు మాత్రమే చేసుకునే పండుగ పుత్తారి (కొత్త వరి పంట). కొడగుల్లో నవంబర్-డిసెంబర్ నెలల్లో వరి కోతకు సిద్ధంగా ఉన్నప్పుడు దీనిని జరుపుకుంటారు. చేతికి వచ్చిన వరి పంటను కుటుంబ పెద్ద కోయటం ఆనవాయితీగా వస్తోంది. ఓ పౌర్ణమి రాత్రిలో 'పోలి..పోలి..దేవా' (ఓ దేవా..మాకు సమృద్ధిగా పంటలు ఇవ్వండి) అనే కీర్తనలతో వరి కోతలు ప్రారంభిస్తారు. వారు కొలిచే ప్రధాన దేవతైన ఇగుతప్పను పిలవటానికి సూచికంగా ఆకాశంలో తుపాకి తూటా ఒక్క షాట్‌ను పేలుస్తారు. ఆ తర్వాత అందరూ కోతలు ప్రారంభిస్తారు. చేతికొచ్చిన పంటలతో పిండి వంటలు, తినుబండారాలు చేసి తమ ఇష్ట దైవాలకు పూజలతో సమర్పిస్తారు. వ్యవసాయంలో భాగమైన జంతువులను ప్రత్యేకంగా పూజిస్తారు. ప్రభలను రంగురంగులుగా అలంకరించి ఊరేగింపులు చేస్తారు. పండుగ సమయాల్లో ప్రజలంతా ఆటపాటల్లో విరివిగా పాల్గొంటారు. శక్తివంతమైన సంస్కృతిని ప్రతిబింబించటానికి తమ వంతుగా కృషిచేస్తారు. 'పుత్తరి కోలాట్' పంట పండిన వెంటనే నిర్వహించబడే జానపద నత్యం. వరి కోసిన తర్వాత, ప్రతి గ్రామంలో పుత్తరి కోలాట్ లేదా పుత్తరి మంద్ నమ్మే నిర్వహిస్తుంటారు. రంగురంగుల పొట్టి కర్రలతో కోలాటం నిర్వహిస్తారు, పుత్తరి కోలాటాన్ని నిర్వహించడానికి పొడవాటి కర్రలను ఉపయోగిస్తారు. సంప్రదాయ డప్పుల శబ్దం, లయబద్ధమైన ధ్వనులకు అనుగుణంగా స్త్రీలు, పురుషులు నృత్యాలు చేయటం సంప్రదాయ కళలో భాగంగా భావిస్తారు. ఐక్యంగా సహపంక్తి భోజనాలు చేస్తుంటారు.

యుద్ధక్రీడలు

కత్తి, డాలుతో ఇద్దరు వ్యక్తులు పొడవాటి కర్రలు పట్టుకుని యుద్ధ క్రీడల్లో మాదిరిగా చేసే సాహసాలను 'పారేకలి'గా పిలుస్తుంటారు. యుద్ధకళను తలపించేలా ఈ సంస్కృతికి సంరక్షకుడిగా మాంధ్‌ను పేర్కొంటారు. జిల్లాస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ ఆయా తెగకు చెందిన పెద్దలు ఉంటారు. వారు తీర్పులకు ఆయా ప్రాంత ప్రజలు కట్టుబడి ఉంటారు.

ప్రాముఖ్యత కోల్పోతున్నారు

ప్రపంచీకరణ ప్రభావం, పాలకుల విధానాలకుతోడుగా కొందరు అక్రమార్కులు ఇలాంటి ప్రాంతాలపై కేంద్రీకరించటంతో వారు తమ ప్రాభవాన్ని కోల్పోతున్నారు. గతంలో 240 కొడగు ప్రాంతాలుండగా నేడు 80 వరకూ తగ్గాయి. అయినప్పటికే అనేకమందితో కూడిన బృందాలు, కొడవు సమాజాలు, ఇతర సంస్థలు వాటిని పునరుద్ధరించే కృషిని కొనసాగిస్తున్నాయి.

రంగవల్లి




24 చుక్కలు
12 వరుసలు
(సరి చుక్క)



వాడ్రేవు జానకీ సత్యభాను
దీక్షిత్‌నగర్,
అంబాజీపేట,
తూర్పుగోదావరి జిల్లా.

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com
వాట్సాప్ :
83329 25496



11 నుండి
6 వచ్చే వరకు,



కె. సౌమ్య,
విజయవాడ,
ఎన్‌టిఆర్ జిల్లా.



'పుష్ప-2' వాయిదా లేదు


అల్లు అర్జున్ రష్మిక మందన్నా జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'పుష్ప-2'. ఈ ఏడాదిలో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని షూటింగ్ వేగవంతం చేశారు. అయితే ఈ చిత్రంలో అల్లు అర్జున్ స్నేహితుడిగా కేశవ పాత్రలో నటిస్తున్న జగదీష్, హత్య కేసులో అరెస్ట్ అయ్యాడు. అప్పటి నుండి ఈ సినిమా విడుదల వాయిదా పడుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. గురువారం ఈ సినిమా డైరెక్టర్ సుకుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఈ విషయంపై మైత్రీ మూవీ మేకర్స్ ఓ పోస్ట్ విడుదలచేశారు. ఆయనకు బర్త్ డే విషెస్ తెలుపుతూ 'పుష్ప-2' 2024 ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు.

కమల్ సినిమాలో ఐశ్వర్యారాయ్



కోలీవుడ్ హీరో కమల్‌హాసన్ నటిస్తున్న తాజా చిత్రం 'థగ్స్ లైఫ్'లో మాజీ విశ్వ సుందరి ఐశ్వర్యారాయ్ నటించబోతున్నారు. ఈ చిత్రానికి మణిరత్నం దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రం ఈనెలలో సెట్స్‌పైకి వెళ్లనున్నట్లుగా సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన ఒక వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. అందులో కమల్‌హాసన్ తన శత్రువులతో తన పేరు రంగరాయ శక్తివేల్‌నాయకన్ (కాయల్ పట్టికి చెందిన వాడిని) అని చెప్పే డైలాగ్ ఆసక్తికరంగా ఉంది. త్రిష జయం రవి, దుల్కర్‌సల్మాన్ జంటగా నటించే అవకాశం ఉన్నట్లుగా సమాచారం.

నయనతార సినిమా స్ట్రీమింగ్‌ని నిలిపివేశారు




నయనతార తాజాగా నటించిన చిత్రం 'అన్నపూరణి'. నయన్ కెరీర్‌లో 75వ సినిమాగా వచ్చిన ఈ చిత్రానికి నీలేష్ కృష్ణ దర్శకత్వం వహించారు. డిసెంబర్ 01న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా స్ట్రీమింగ్‌ను నిలిపివేస్తునట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. ఈ సినిమాలో రాముడు మాంసం తిన్నాడని.. ఇది వాల్మీకి అయోధ్య కాండలో ఉంది అంటూ ఒక డైలాగ్ ఉంటుంది. తాజాగా ఈ సినిమా చూసిన మహారాష్ట్రకు చెందిన శివసేన మాజీ నేత రమేశ్ సోలంకి మూవీలోని కొన్ని సీన్స్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే హీరో ముస్లిం అయ్యి ఉండడం, హీరోయిన్ బ్రాహ్మణ కుటుంబానికి చెంది ఉండడంతో లవ్ జీహాద్‌ను ప్రోత్సహించేలా ఉందని.. ఈ మూవీ నిర్మాతలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే ఈ సినిమాను స్ట్రీమింగ్ చేస్తున్న నెట్ ఫ్లిక్స్‌పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సినిమా విషయంలో నయనతారపై కూడా కేసు నమోదు అయ్యింది.

'ఇంకా ఇంకా దూరమే...' అంటున్న నాగార్జున



నాగార్జున నటిస్తున్న 'నా సామిరంగ' చిత్రం నుండి తాజాగా మరో పాట విడుదలైంది. 'ఇంకా ఇంకా దూరమే మాయమవుతుంటే.. ఇంకా ఇంకా ప్రాణమే దగ్గరవుతుంటే.. అంటూ ఎమోషనల్‌గా ఈ పాట సాగింది. ఈ పాటను మమన్ కుమార్, సత్య యామిని ఆలపించారు. ఎం ఎం కీరవాణి సాహిత్యంతో పాటు సంగీతం సమకుర్చారు. ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తున్నారు. విజయ్ బన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అల్లరి నరేష్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

మిస్ ఫర్ఫెక్ట్ టీజర్ విడుదల



లావణ్య త్రిపాఠీ, అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలకపాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'మిస్ ఫర్ఫెక్ట్'. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో త్వరలో విడుదల కానుంది. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ టీజర్‌ను చిత్ర నిర్మాతలు గురువారం విడుదల చేశారు. త్వరలో డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతోంది. ఎడిటర్ రవితేజ గిరిజాల, సినిమాటోగ్రఫీ ఆదిత్య జవ్వాది, సంగీతం ప్రశాంత్ ఆర్ విహారి అందించారు.

'శివ'మెత్తిన దూబే

- బౌలింగ్‌లో రాణించిన ముఖేశ్, అక్షర్
- తొలి టి20లో ఆఫ్ఘన్‌పై టీమిండియా ఘన విజయం



మొహాలీ: ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన తొలి టి20లో బ్యాటింగ్‌లో శివమ్ దూబే, బౌలింగ్‌లో ముఖేశ్ కుమార్, అక్షర్ పటేల్ రాణించడంతో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘన్‌ను భారత బౌలర్లు కట్టడి చేయడంలో నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 158పరుగులు చేసింది. ఛేదనలో టీమిండియాకు 17.4ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 159పరుగులు చేసి ఘన విజయం సాధించింది. లక్ష్యాన్ని ఛేదించేందుకు బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఓవర్ రెండో బంతికే కెప్టెన్ రోహిత్ శర్మ (0)డకౌట్ అయ్యాడు. రోహిత్ శర్మ, శుభ్‌మన్‌ల మధ్య సమన్వయలోపంతో రోహిత్ రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత శివమ్ దూబే(60నాటౌట్; 40బంతుల్లో 5ఫోర్లు, 2సిక్సర్లు) అర్ధసెంచరీకి తోడు శుభ్‌మన్(23), తిలక్ వర్మ(26), జితేశ్ శర్మ(31) సమయోచితంగా బ్యాటింగ్ చేశారు. చివర్లో దూబే, రింకు సింగ్(16నాటౌట్; 2ఫోర్లు) మరోవికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. ఆఫ్ఘన్ బౌలర్లు ముజీబ్‌కు రెండు, అజమతుల్లాకు ఒక వికెట్ దక్కాయి. అంతముందు టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు ఆఫ్ఘనిస్థాన్‌ను ఆలౌట్ చేయకపోయినా, భారీ స్కోరు సాధించకుండా కట్టడి చేశారు. నబీ(42; 27బంతుల్లో 2ఫోర్లు, 3సిక్సర్లు), నజీబుల్లా జాద్రాన్(19; 11బంతుల్లో 4ఫోర్లు) చివర్లో ధాటిగా ఆడారు. రహ్మనుల్లా గుర్బాజ్(23), కెప్టెన్ ఇబ్రహీం జాద్రాన్(25), అజ్మతుల్లా ఒమర్జాయ్(29) బ్యాటింగ్‌లో రాణించారు. టీమిండియా బౌలర్లలో అక్షర్ పటేల్, ముఖేశ్ కుమార్‌కు రెండేసి, శివమ్ దూబేకు ఒక వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శివమ్ దూబేకు లభించగా.. రెండో టి20 ఇండోర్ వేదికగా ఆదివారం జరగనుంది.

స్కోర్‌బోర్డు..

ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి)జితేశ్ (బి)అక్షర్ 23, జద్రాన్ (సి)రోహిత్ (బి)దూబే 25, ఒమర్జాయ్ (బి)ముఖేష్ 29, రామత్ షా (బి)అక్షర్ 3, మహ్మద్ నబి (సి)రింకు సింగ్ (బి)ముఖేశ్ 42, నజీబుల్లా (నాటౌట్) 19, కరీమ్ జనత్ (నాటౌట్) 9, అదనం 8. (20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 158పరుగులు. **వికెట్ల పతనం:** 1/50, 2/50, 3/47, 4/125, 5/130 **బౌలింగ్:** అర్షదీప్ 4-1-28-0, ముఖేశ్ కుమార్ 4-0-33-2, అక్షర్ పటేల్ 4-0-23-2, సుందర్ 3-0-27-0, శివమ్ దూబే 2-0-9-1, బిష్ణోయ్ 3-0-35-0,

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (రనౌట్)ఇబ్రహీమ్/గుర్బాజ్ 0, శుభ్‌మన్ (స్టంప్)గుర్బాజ్ (బి)ముజీబ్ 23, తిలక్ వర్మ (సి)గుల్బద్దిన్ (బి)అజ్మతుల్లా 26, శివమ్ దూబే (నాటౌట్) 60, జితేశ్ శర్మ (సి)ఇబ్రహీం (బి)ముజీబ్ 31, రింకు సింగ్ (నాటౌట్) 16, అదనం 3. (17.3ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 159పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/28, 3/72, 4/117 **బౌలింగ్:** ఫారూఖీ 3-0-26-0, ముజీబ్ 4-1-21-2, నబీ 2-0-24-0, నవీన్ 3,3-0-43-0, అజ్మతుల్లా 4-0-33-1, గుల్బుద్దిన్ 1-0-12-0

ఆంధ్ర కెప్టెన్‌గా రికీ బుయ్

నేటినుంచి ఆంధ్ర × ముంబయి రంజీమ్యాచ్



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ రంజీజట్టు కెప్టెన్‌గా రికీ బుక్ ఎంపికయ్యాడు. బ్యాటింగ్‌పై దృష్టి సారించాలనే ఉద్దేశ్యంతో కెప్టెన్ పదవి నుంచి వైదొలిగినట్లు హనుమ విహారి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించాడు. బెంగాల్‌తో జరిగిన రంజీట్రోఫీ తొలి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రజట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత సంపాదించి మూడు పాయింట్లు చేసుకొంది. రంజీట్రోఫీ రెండో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు పటిష్ట ముంబయితో శుక్రవారం నుంచి రెండో మ్యాచ్ ఆడనుంది. పదేళ్లుగా ఆంధ్ర రంజీజట్టుకు కెప్టెన్‌గా ఉన్న విహారి... ఇటీవలికాలంలో భారీస్కోర్‌లు చేయడంలో విఫలమౌతున్నాడు. ఈ క్రమంలో కెప్టెన్సీని వదులుకున్నాడని నెట్ ప్రాక్టీస్ అనంతరం రికీ బుయ్ తెలిపాడు. ఆంధ్రజట్టును వీడాలనే విహారి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

క్వార్టర్స్‌కు సాత్విక్-చిరాగ్ జంట

- మహిళల డబుల్స్‌లో కూడా..

కౌలాలంపూర్: మలేషియా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగియగా.. పురుషుల, మహిళల డబుల్స్ జోడీలు క్వార్టర్‌ఫైనల్‌కు చేరాయి. పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-11, 21-18తో ఫ్రాన్స్‌కు చెందిన కార్వీ-లాబర్‌పై సునాయాసంగా నెగ్గారు. క్వార్టర్స్‌లో చైనాకు చెందిన టింగ్-ఖియాంగ్ యూతో అమీతుమీ తేల్చుకోనున్నారు. మహిళల డబుల్స్ జోడీ తానీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప జంట 21-19, 13-21, 21-15తో జపాన్‌కు చెందిన మట్సుమోటో-నగహరాపై పోరాడి నెగ్గారు. తొలిగేమ్‌ను పోరాడి నెగ్గిన భారతజంట.. రెండో గేమ్‌ను సునాయాసంగా కోల్పోయారు. నిర్ణయాత్మక మూడోగేమ్‌లో రాణించి మ్యాచ్‌ను ముగించారు.

క్వార్టర్స్‌లో జపాన్‌కే చెందిన ఇవనగా-నకనిషితో తలపడనున్నారు. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత్ పోరు ముగిసింది. రౌండ్‌రౌండ్‌కు చేరిన ఏకైక షట్లర్ కిదాంబి శ్రీకాంత్ ఓటమిపాలయ్యాడు.

రిథమ్ సాంగ్వాన్‌కు ఒలింపిక్ బెర్త్

భారత్‌నుంచి పారిస్‌కు 16వ షూటర్



జకార్తా: మరో షూటర్ ఒలింపిక్స్ బెర్త్ సాధించారు. 25మీ. స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో రిథమ్ సాంగ్వాన్ అదరగొట్టింది. పారిస్ ఒలింపిక్స్ బెర్తు సొంతం చేసుకుంది. సాంగ్వాన్ గురువారం ఆసియా క్వాలిఫయర్స్ మహిళల 25మీ. స్పోర్ట్స్ పిస్టల్‌లో కాంస్య పతకం సొంతం చేసుకుంది. 20 ఏళ్ల రిథమ్ సాంగ్వాన్‌కు ఆసియా క్వాలిఫయర్స్‌లో ఇది మూడో పతకం. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్య పతకం సాధించిన ఆమె.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అర్జున్ చీమాతో కలిసి రజత పతకం అందుకుంది. రిథమ్ సాంగ్వాన్ అర్హతతో భారత్ నుంచి పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడే షుటర్ల సంఖ్య 16కి చేరింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68